ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించడం జరుగుతుందని కలెక్టర్ పి.రంజిత్ భాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అర్జీలు స్వీకరిస్తామన్నారు.

తెల్లారిన బతుకులు..



దూరాన బిడ్డలు.. ఒడిలో భార్య

ఆనందంతో తల్లిదండ్రులతో కలిసి సొంత ఆటోలో ఆడుతూ..పాడుతూ స్వగ్రామానికి బయల్దేరిన ఆ చిన్నారులకు తెలియదు తల్లిప్రేమకు దూరమవుతున్నామని. వారు ప్రయాణిస్తున్న ఆటోను వెనుక నుంచి కారు ఢీకొనడంతో చిన్నారుల తల్లి బీబీ తీవ్రంగా గాయపడి మృతి చెందగా ఆ చిన్నారులు సైతం రక్తగాయాలపాలై స్పృహ కోల్పోయారు. తమ తల్లి ప్రమాదంలో మృతి చెందిందన్న విషయం ఆ చిన్నారులకు తెలియకపోవడం కలిచివేసింది. ఓ వైపు కొన ఊపిరితో ఉన్న భార్య.. మరో వైపు ఇద్దరు బిడ్డలు స్పృహ కోల్పోవడం.. తీవ్ర గాయాల నొప్పిని భరిస్తూ ఆవేదన వ్యక్తం చేస్తున్న గనిబాషా తీరు అందర్నీ కలచివేసింది. చనిపోయేముందు భార్యను ఒడిలోకి తీసుకుని దూరాన పడి ఉన్న బిడ్డలను చూస్తూ ఆయన చేసిన రోదన వర్ణనాతీతం. నాకు, నా బిడ్డలకు దిక్కెవరు అంటూ ఆయన బోరున విలపించాడు.

- దైవ దర్శనానికి వెళ్లి వస్తూ తిరిగిరాని లోకాలకు
- మంత్రాలయం హైవేవద్ద ఘోర రోడ్డు ప్రమాదం
- ఆటోను ఢీకొన్న కారు
- ముగ్గురు మహిళలు దుర్మరణం
- ఇద్దరు చిన్నారులు, ఆటో డ్రైవర్‌కు గాయాలు
- కొన ఊపిరితో ఉన్న భార్యను చూసి రోదనలు
- అతివేగమే ప్రమాదానికి కారణం



ముల్లా బీబీ (ఫైల్)



కురువ వీరనాగమ్మ(ఫైల్)



కురువ గౌరమ్మ (ఫైల్)



గాయపడ్డ చిన్నారి

ముందురోజు అమావాస్య కావడంతో ఇష్టదైవాన్ని ప్రార్థించుకుని రోజంతా దైవ సన్నిధిలోనే గడిపారు. అమావాస్య ఘడియలు ముగియగానే సొంతూర్లకు వెళ్లి పనులు చేసుకోవాల్సిన వారు అనంతలోకాలకు చేరిపోయారు. మరికొద్ది సేపట్లో గమ్యస్థానానికి చేరుతామనుకున్న వాళ్ల బతుకులు అంతలోనే ముగిసిపోయాయి. తెల్లవారుజామున ఆటోలో ప్రయాణిస్తున్న తమను మృత్యువు కారు రూపంలో కబళిస్తుందని వారు ఊహించలేకపోయారు. ఆటోను కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు మహిళలు మృత్యుఒడిలోకి జారిపోయారు. భర్త ఎదుటే భార్య ప్రాణాలు కోల్పోవడం అందరినీ కంటతడి పెట్టించింది. ఆ సంఘటనను చూసిన ప్రతి ఒక్కరూ చలించిపోయారు. అతివేగంగా వచ్చిన కారు ఆటోను ఢీకొనడంతో ముగ్గురు మహిళలు మృతి చెందిన సంఘటన నందవరం మండలం ధర్మాపురం టోల్‌ప్లాజా సమీపంలో హైవేపై శనివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది.

వివరాలు 7లో





పొలాల్లోకి ఎగిరిపడ్డ ఆటో, మరో వైపు దూసుకెళ్లిన కారు



గాయపడ్డ చిన్నారి ఖాజావలి

నడిరోడ్డుపై అమ్మ

- అర్ధరాత్రి నడివీధిలో వదిలేసిన కొడుకు
- పత్తికొండలో అమానవీయ ఘటన



కుమారుడు రోడ్డుపై వదిలిపోవడంతో దీనంగా కూర్చున్న వృద్ధురాలు తిరుపతమ్మ

నవమాసాలు మోసి కని పెంచిన తల్లి అవసాన దశలో బరువైంది. పసిబిడ్డగా ఉన్నప్పుడు చనుబాలతో కడుపు నింపిన తల్లిని వదిలించుకున్నాడు కన్నకొడుకు. జోలపాట పాడి ఊయలూపిన అమ్మను కర్కశంగా రోడ్డుపై వదిలేశాడు. వృద్ధాప్యంలో కన్నబిడ్డ బాగా చూసుకుంటాడనుకున్న ఆ తల్లి జీవితం తారుమారైంది. ఆ కొడుకు, కోడలే ఆమెను వద్దనుకున్నారు. ఆ పండుటాకుని భారంగా భావించారు. ఇంట్లో నుంచి తరిమేసి నడిరోడ్డుపాలు చేశారు. మానవత్వాన్ని మంటగలిపే ఈ ఘటన పత్తికొండ పట్టణంలో శనివారం చోటు చేసుకుంది.

వివరాలు 6లో...

మా బతుకులతో ఆడుకోవద్దు

- యురేనియం తవ్వకాలపై పెరిగిన ఆందోళన స్వరం
- కర్నూలు-బళ్లారి రహదారి దిగ్బంధం
- తవ్వకాలకు వ్యతిరేకంగా తరలి వచ్చిన మహిళలు
- బాధిత గ్రామాల్లోని విద్యార్థుల ర్యాలీ

దేవనకొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా ప్రజా నిరసనలు ఊపందుకుంటున్నాయి. బాధిత గ్రామాల్లోని అన్ని వర్గాల ప్రజలు ఆందోళనల్లో భాగమవుతున్నారు. యురేనియం తవ్వకాలు చేపట్టి తమ బతుకులతో ఆటాలాడొద్దని ప్రభుత్వాలను హెచ్చరిస్తున్నారు. కప్పట్రాళ్ల, పి. కోటకొండ, మరో తొమ్మిది గ్రామాలు ప్రజలు శనివారం వీధుల్లోకి వచ్చారు. ఆనాటి ఫ్యాక్షన్ చీకట్ల నుండి మెల్లమెల్లగా ఇప్పుడే బైటికి వస్తుండగా మళ్లీ యురేనియం తవ్వకాలతో తమ జీవితాలను నాశనం చేయవద్దంటూ కర్నూలు-బళ్లారి రహదారిపై నిరసన కార్యక్రమం చేపట్టారు. ఉదయం 9గంటలకు మొదలైన రహదారి దిగ్బంధనం మధ్యాహ్నం 12.30 వరకు కొనసాగింది. కప్పట్రాళ్ల గ్రామంలో ఉదయాన్నే మహిళలు పెద్ద ఎత్తున కర్నూలు-బళ్లారి రహదారిపై బస్‌స్టాప్ వద్దకు చేరుకున్నారు. రోడ్డుపై వాహనాలు వెళ్లకుండా ముళ్లకంచె అడ్డుగా వేసి ధర్నా ప్రారంభించారు. ధర్నాలో కప్పట్రాళ, పి. కోటకొండ, నెల్లిబండ, జిల్లెలబుడకలు, కరివేముల తదితర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. రిజర్వు ఫారెస్టులో యుసిఐఎల్ బోర్లు వేసేందుకు వస్తే చూస్తూ ఊరుకోబోమని, తమపై నుంచి వాహనాలు వెళ్లాల్సి ఉంటుందని మహిళలు హెచ్చరించారు. తమ జీవితాలను నాశనం చేసే యురేనియం తవ్వకాలకు పాల్పడితే పురుగుల మందు తాగి ఆత్మహత్యలకు పాల్పడుతామంటూ మందు డబ్బాలతో నిరసన తెలిపారు. ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి రహదారి దిగ్బంధం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉద్యమకారులను అరెస్టు చేయడానికి సీఐ వంశీనాథ్ వచ్చి.. ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడంతో వెనక్కి తగ్గారు. పత్తికొండ ఆర్డీవో భరత్ నాయక్ ఆందోళనదారుల వద్దకు వచ్చి సోమవారం కప్పట్రాళ్లకు కలెక్టరు వస్తారని, యురేనియం తవ్వకాల సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని తెలియజేయడంతో ప్రజలు ఆందోళన విరమించారు. దాదాపు మూడున్నర గంటలపాటు చేసిన రోడ్డు దిగ్బంధనంతో దాదాపు మూడు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ఈ ఆందోళనలో కప్పట్రాళ్ల పాఠశాలలోని విద్యార్థులు ప్లకార్డులతో పాల్గొన్నారు. దేవనకొండ జూనియర్ కళాశాలలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పాల్గొన్నారు. పి. కోటకొండలో పలు పాఠశాలల విద్యార్థులు ర్యాలీ చేశారు.



కర్నూలు-బళ్లారి రహదారిపై ధర్నా చేస్తున్న పలు గ్రామాల ప్రజలు



ధర్నాలో పాల్గొన్న పాఠశాల విద్యార్థులు



రోడ్డుకు అడ్డంగా వేసిన కంచె

పచ్చని పొలాలు నాశనమవుతాయి



యురేనియం తవ్వకాలు జరిపితే పచ్చని పంటపొలాలు నాశనం అవుతాయి. బంగారం పండే భూములు కోల్పోయి సర్వం కోల్పోయే పరిస్థితులు వస్తాయి.

- చింపి ఈరన్న, కప్పట్రాళ్ల

యువతను సమీకరిస్తాం



హంద్రీనీవా కాలువ రావడంతో మా గ్రామంలో పంటలు బాగా పండించుకుంటున్నాం. ఇప్పుడు యురేనియం తవ్వకాలు చేపడితే సర్వ నాశనం అవుతాం. ఈ తవ్వకాలకు వ్యతిరేకంగా గ్రామంలోని యువతను సమీకరించి ఆందోళన చేస్తాం.

- సుభాష్, డిగ్రీ విద్యార్థి కప్పట్రాళ్ల

తవ్వకాలను అడ్డుకుంటాం



మా గ్రామాల్లో యురేనియం బోర్లు వేయడానికి వస్తే అడ్డుకుంటాం. మా జీవితాలు నాశనం చేసే యురేనియం తవ్వకాలను ప్రభుత్వం ఆపా లి.

- శాలుబీ

జగన్ హయాంలోనే యురేనియం అనుమతులు : టీడీపీ

కర్నూలు అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్ పాలనలోనే జిల్లాలో యురేనియం పరిశీలన, తవ్వకాలకు అనుమతులు ఇచ్చారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. శనివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆలూరు నియోజకవర్గంలో వైసీపీ నాయకులు సీఎం చంద్రబాబుపై అనవసరంగా నిందలు వేస్తున్నారన్నారు. రాష్ట్రంలో వైసీపీని 11 సీట్లకే పరిమితం చేసినా ఆ పార్టీ నాయకుల్లో మార్పు రాలేదన్నారు. ఎన్డీయే ప్రభుత్వం ప్రజలకు నష్టం చేకూర్చే పనులకు పాల్పడదన్నారు. ప్రస్తుతం శాంపిల్స్ సేకరిస్తున్నారని, ఇంకా నిర్ధారణ కాలేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రజలు సైతం సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, ఆకెపోగు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తిక్కారెడ్డి

రహదారుల మరమ్మతులకు రూ.19.87 కోట్లు

- పనులు ప్రారంభించిన మంత్రి టీజీ భరత్



రోడ్ల పనులను ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రహదారుల మరమ్మతులకు రూ.19.87 కోట్ల నిధులు కేటాయించినట్లు మంత్రి టీజీ భరత్ తెలిపారు. శనివారం నగరంలోని ఐదురోడ్ల కూడలిలో గుంతల రోడ్ల పనులను మంత్రి టీజీ భరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో గుంతల రహదారుల్లో ప్రయాణాలు సాగించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని, సీఎం ఆలోచన మేరకు రాష్ట్రంలోని రహదారులు గుంతలుగా లేకుండా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో మొదటి దశగా 69 పనులను రూ.11.16 కోట్ల వ్యయంతో 412 కిలోమీటర్ల మేర పనులను గుంతలు రహిత రహదారులుగా చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో అర్ అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ రవీంద్ర బాబు, ఆర్డీవో సందీప్ కుమార్, ఈఈ సురేష్ బాబు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

18న డాక్ అదాలత్

కర్నూలు న్యూసిటీ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పోస్టాఫీసులో అందిస్తున్న సేవలపై ఈనెల 18న డాక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కర్నూలు డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ జి.జనార్దన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాతబస్టాండు వద్ద ప్రధాన తపాలా కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. డాక్ అదాలత్‌కు పోస్టాఫీసు సేవలపై ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే పోస్టు కవర్ ద్వారా డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ జి.జనార్దన్‌రెడ్డి, కర్నూలు డివిజనల్ కార్యాలయం, పాతబస్టాండు అడ్రస్‌కు ఈ నెల 14వ తేదీలోగా పంపాని ఆయన విజ్ఞప్తి చేశారు.

పింఛన్ల పంపిణీలో టాప్

- వరుసగా నాలుగోసారి కర్నూలు జిల్లా అగ్రస్థానం

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో కర్నూలు జిల్లా వరుసగా నాలుగోసారి టాప్‌లో నిలిచింది. నవంబరు మాసంలో కూడా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో 99.46 శాతంతో కర్నూలు జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచింది. జిల్లాలో మొత్తం 2,41,029 పింఛన్లు ఉండగా.. అందులో 2,39,718 పింఛన్లను పంపిణీ చేసి 99.46 శాతంతో కర్నూలు జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. ఆగస్టు నెలలో 98.03 శాతం, సెప్టెంబరులో 99.47 శాతం, అక్టోబరు నెలలో 99.13 శాతం, నవంబరు నెలలో 99.46 శాతంతో జిల్లా ముందువరుసలో ఉండటం విశేషం.



పనులు చేయకుండా ప్రజాధనం మింగేశారు..!

- రూ.10 కోట్లకు పైగా స్వాహా
- వైసీపీ ప్రభుత్వంలో నాటి ఇంజనీరింగ్ అధికారుల భాగోతం
- నీరు-చెట్టు కింద చేయని పనులకు బిల్లులు
- జలవనరుల శాఖలో భారీ కుంభకోణం
- గతంలో పని చేసిన ఇంజనీర్లకు కోర్టు నోటీసులు రావడంతో వెలుగులోకి

కర్నూలు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన తరువాత ఆనాటి టీడీపీ నీరు-చెట్టు పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పథకం అమలులో అవినీతి జరిగిందని బిల్లులు ఆపేసింది. కాంట్రాక్టర్లు న్యాయ స్థానాన్ని ఆశ్రయించడంతో కోర్టు ఆదేశాల మేరకు కొంత వరకు బిల్లులు చెల్లించారు. ఇదే అవకాశంగా తీసుకున్న ఇంజనీరింగ్ అధికారులు కొందరు అప్పటి అధికార పార్టీ అండదండలు ఉన్న కాంట్రాక్టర్లతో కుమ్మక్కై నీరు-చెట్టు కింద పనులు చేయకుండానే ప్రజాధనం మింగేశారు. ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి రూ.10 కోట్లకు పైగా ప్రజాధనం స్వాహా చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆయా మండలాల్లో గతంలో పని చేసిన మండల స్థాయి ఇంజనీర్లకు కోర్టు నోటీసులు రావడంతో అవినీతి భాగోతం బయటకు పొక్కింది. కర్నూలు జలవనరుల శాఖలో వెలుగు చూసిన భారీ కుంభకోణంపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ కోసం పలువురు డిమాండ్ చేస్తున్నారు.

మిగతా 6లో...



జంగిల్ క్లియరెన్స్ చేయకుండానే నిధులు డ్రా జరిగిన ముల్లవాగు ఇదే

ఇళ్లను కూల్చారు...రోడ్డున పడేశారు

- డబ్లింగ్ పనులకు అడ్డం ఉన్నాయని ఆవాసాలను కూల్చేసిన రైల్వే అధికారులు
- 90 ఏళ్లుగా నివసిస్తున్నామని విలపించిన బాధితులు

తుగ్గలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): దాదాపు 90 ఏళ్లుగా అక్కడ నివసిస్తున్న వాళ్ల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా రైల్వే అధికారులు కూల్చేశారు. శనివారం రైల్వే అధికారులు డబ్లింగ్ పనులను అడ్డంగా ఉన్నాయని తమ ఇళ్లను కూల్చేశారని, తమకు ప్రభుత్వ స్థలాలు కేటాయించి ఇళ్లు కట్టించాలని బాధితులు సునీత, ఆదిలక్ష్మి, అంజలి, నాగలక్ష్మి బోరున విలపించారు. పెండేకల్ ఆర్ఎస్‌లో గత 90 ఏళ్ల నుంచి తమ పూర్వీకుల కాలం నుంచి ఇక్కడ జీవిస్తున్నామని, రెవెన్యూ అధికారులు పొజిషన్ సర్టిఫికెట్లను మంజూరు చేయడంతో అప్పు చేసి ఇళ్లు కట్టుకున్నామని వారు తెలిపారు. సాఫీగా సాగుతున్న తమ జీవితాన్ని రైల్వే అధికారులు చిన్నాభిన్నం చేశారని ఆవేదన పడ్డారు. కూలీ పనులకు వెళ్లి డబ్బులు కూడబెట్టుకొని, కొంత అప్పు చేసి డబ్బు తెచ్చి నిర్మించుకున్న ఇళ్లను కూల్చివేసి, తమ కుటుంబాలను రోడ్డున పడేశారని అన్నారు. రైల్వే స్థలంలో ఇళ్లు కట్టుకున్నామని, డబ్లింగ్ పనులకు అడ్డం వచ్చాయనే సాకుతో కూల్చేశారని, ప్రభుత్వం తమకు స్థలం ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని నాలుగు బాధిత కుటుంబాల వారు కోరారు.



ఇల్లు కూల్చివేయడంతో ఆరుబయట ఇంటి సామగ్రితో బాధితులు



ఇల్లు కూల్చేస్తున్న రైల్వే అధికారులు

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి కృషి చేస్తాం

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్

ప్యాపిలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. శనివారం మండలంలో వాల్మీకి గుహల దగ్గర కర్ణాటక వాల్మీకి గురుపీఠం ప్రసన్నానందపురి మహాస్వామిజీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహర్షి వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో డోన్, ఆదోని ఎమ్మెల్యేలు కోట్ల ప్రకాష్‌రెడ్డి, పార్థసారధితో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సత్యకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోని రావడానికి వాల్మీకుల పాత్ర ఉందన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడుతానన్నారు. కేంద్ర నిధులతో వాల్మీకి గుహలను మరింత అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా మారుస్తామని హామీ ఇచ్చారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ వాల్మీకులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి చంద్రబాబు ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారధి మాట్లాడుతూ వాల్మీకులు అన్ని రంగాల్లో చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై నాగేశ్వరరావుయాదవ్, కేఈ రుద్రఫణిగౌడు, వలసల రామక్రిష్ణ, వడ్డె మహారాజ్, మాజీ ఎంపీపీ సరస్వతి, డాక్టర్ భవానీ ప్రసాద్, వై లక్ష్మీనారాయణ యాదవ్, టి శ్రీనివాసులు, న్యాయవాది భాస్కర్ నాయుడు, మద్దులేటి, కంబయ్య, కంబగిరిస్వామి పాల్గొన్నారు.



వాల్మీకుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సత్య కుమార్


శ్రీగిరిపై కార్తీక శోభ



గంగాధర మండపం వద్ద కార్తీక దీపాలు



- భారీగా తరలివచ్చిన భక్తులు
- పాతాళగంగలో పుణ్యస్నానాలు
- ఆకట్టుకున్న ఆకాశదీపం



శ్రీశైలం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహా క్షేత్రంలో శనివారం కార్తీక ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. కార్తీకమాసం మొదటిరోజును పురస్కరించుకుని క్షేత్రానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. శనివారం వేకువజాము నుంచే వందల సంఖ్యలో భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్ల దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరారు. వేకువజామున 3 గంటలకు ఆలయద్వారాలు తెరచి, ప్రాతఃకాల పూజలు జరిపారు. అనంతరం ఉదయం 4:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5:30 నుంచి రాత్రి 11 గంటల వరకు స్వామి, అమ్మవార్ల దర్శనాలు కొనసాగాయి. ఉదయం నుంచే భక్తులు ఆలయ ఉత్తర మాడవీధి ప్రాంగణం, దేవాలయం ఎదురుగా ఉన్న గంగాధర మండపం వద్ద మహిళలు దీపారాధనలను చేశారు. అదేవిధంగా కొంత మంది భక్తులు లక్ష వత్తుల నోములను నోచుకున్నారు. క్యూలైన్లలో వేచివున్న భక్తులకు దేవస్థానం అధికారులు నిరంతరం మంచినీళ్ళు, బిస్కెట్లు, అల్పాహారం అందజేశారు. దర్శనానంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్తీకమాసోత్సవాల సందర్భంగా దేవస్థానంలో అఖండ శివ భజన కార్యక్రమం ప్రారంభమైంది. ఆలయ ఈఓ చంద్రశేఖరరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న ఆకాశ దీపం

కార్తీకమాసోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ సాయంత్రం ఆలయ ధ్వజస్తంభం వద్ద ఆకాశదీపం కార్యక్రమం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని ధ్వజస్తంభం వద్ద ఆకాశదీపం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆకాశదీప ప్రజ్వలనకు ముందుగా అర్చకులు సంకల్పాన్ని పఠించారు. ఈ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి స్వామికి విశేష పూజలు చేసి, దీపప్రజ్వలన, దీపారాధనలను జరిపారు.



పూజలు నిర్వహిస్తున్న ఆలయ ఈఓ





కళాకారుల నృత్యం

ఆసుపత్రిలో సమస్యలను పరిష్కరించాలి

- ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి



సూపరింటెండెంట్‌ను కలిసిన ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వెంగళ్‌రెడి

కర్నూలు హాస్పిటల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో సమస్యలను పరిష్కరించాలని, రోగులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కె. వెంకటేశ్వర్లును కోరారు. శనివారం కొత్తగా సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లును వెంగళ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ ఔషధశాల రేకుల షెడ్డులో ఉండటం వల్ల చిన్న పిల్లలు, గర్భిణులకు చెందిన మందులు చెడిపోతున్నాయని, ఎలుకల బెడద అధికంగా ఉందని చెప్పారు. ఔషధశాలను తక్షణమే మార్చి రోగులకు దగ్గర ఉండే క్యాజువాల్టీ సమీపంలో మార్చాలని కోరారు. నర్సింగ్ సిబ్బందికి వాష్‌రూమ్‌లను ఏర్పాటు చేయాలని, నర్సెస్ అసోసియేషన్ భవనానికి మరమ్మతులు చేయించాలని కోరారు. మినిస్టీరియల్, పారామెడికల్ సిబ్బంది సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏపీఎన్జీవో రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ దస్తగిరిరెడ్డి, కర్నూలు సిటీ అధ్యక్షుడు ఎంసీ కాశన్న, ఏపీ జేఏసీ కో చైర్మన్ మద్దిలేటి, ఏపీ ఫార్మాసిస్టు అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు వీరాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు రంగస్వామి, సత్యప్రకాష్, వలి, ఏపీ నర్సెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం. లీలావతి, సి.బంగారి, కోశాధికారి ఎస్. లక్ష్మీనరసమ్మ, ఈసీ సభ్యులు ఎస్.సోమేశ్వరి, శాంతిలత, జే. ఉమారాణి, రామతులసి పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీ ప్రొఫైల్ యాప్‌పై అవగాహన కల్పించాలి

- మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల



మాట్లాడుతున్న మెప్మా పీడీ నాగశివలీల

కర్నూలు న్యూసిటీ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని పొదుపు సంఘాల సభ్యులకు సంబంధించి నిర్దిష్టమైన డేటా సేకరణ కోసం రూపొందించిన ఎస్‌హెచ్‌జీ ప్రొఫైల్ యాప్‌పై అవగాహన కల్పించాలని మెప్మా పీడీ నాగశివలీల సూచించారు. శనివారం ఎస్‌బీఐ కాలనీలోని న్యూ కౌన్సిల్ హాలులో కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు మున్సిపాలిటీలకు సంబంధించి ఆర్‌పీలు, సిబ్బందికి ఎస్‌హెచ్‌జీపై శిక్షణ కల్పించారు. అధికారి మాట్లాడుతూ ఈ యాప్‌లో ప్రతి ఆర్‌పీ తన పరిధిలోని అన్ని సంఘాల వివరాలను సేకరించాలన్నారు. ఈ విధానమైన డేటా వల్ల క్షేత్రస్థాయిలో డూప్లికేషన్‌కు తావు ఉండకూడదన్నారు. కార్యక్రమంలో టీపీఆర్వో వెంకటలక్ష్మి, టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్ ఆసిఫ్‌బాషా, ఏవో భాస్కర్‌రెడ్డి, సిటీ మిషన్ మేనేజర్ సుధాకర్, భారతి, టీఎంసీలు, అన్ని మున్సిపాలిటీల సిబ్బంది పాల్గొన్నారు.

పనులు చేయకుండా ప్రజాధనం మింగేశారు..!



(5వ పేజీ తరువాయి)

జలవనరుల శాఖ కర్నూలు సర్కిల్ పరిధిలోకి తుంగభద్ర దిగువ కాలువ (టీబీపీ ఎల్లెల్సీ) డివిజన్, కేసీ కెనాల్ నంద్యాల డివిజన్, ప్రొటెక్షన్ వర్క్ డివిజన్, మైనర్ ఇరిగేషన్ (ఎంఐ) కర్నూలు, నంద్యాల డివిజన్లు ఉన్నాయి. రాష్ట్ర విభజన తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం భూగర్భ జలాలు పెంపు, నీటి వనరుల సంరక్షణ లక్ష్యంగా 2024-25 నుంచి 2018-19 వరకు నీరు-చెట్టు పథకం ప్రతిష్ఠాత్మంగా అమలు చేశారు. కర్నూలు ఇరిగేషన్ సర్కిల్ పరిధిలో ఆయా డివిజన్లలో దాదాపు రూ.1,585.70 కోట్లు విలువైన పనులు చేపట్టారు. అందులో రూ.580 కోట్లకు పైగా ఖర్చు చేశారు. చెక్ డ్యాంలు నిర్మాణం, చెరువులు, వంకలు, వాగులు, కాలువల్లో పూడికతీత (డీసిల్టింగ్), జంగిల్ క్లియరెన్స్ వంటి పనులు చేపట్టారు. టీడీపీ ప్రభుత్వం చివరి రెండేళ్లలో రూ.1,447 కోట్లకుపైగా విలువైన పనులు చేపట్టి రూ.468 కోట్లు ఖర్చు చేసినట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. అయితే.. 2019 మేలో వైసీపీ ప్రభుత్వం రాగానే నీరు-చెట్టు పనుల్లో భారీగా అవినీతి అక్రమాలు జరిగాయనే ఆరోపణలు బూచి వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లింపులు ఆపేయడమే కాకుండా బిల్లులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయకుండా హెడ్ ఆఫ్ అకౌంట్‌ను క్లోజ్ చేసిందని పేర్కొన్నారు. పనులు చేసిన కాంట్రాక్టర్లు న్యాయస్థానం ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల గత వైసీపీ ప్రభుత్వంలో కొంత వరకు బిల్లులు చెల్లింపునకు శ్రీకారం చుట్టడంతో బిల్లులు అప్‌లోడ్ చేసేందుకు హెడ్ ఆఫ్ అకౌంట్ ఓపన్ చేశారు. ఇదే అదనుగా భావించి నాటి అధికార వైసీపీ ముఖ్య నాయకుల అండదండలు కలిగిన జలవనరుల శాఖ ఇంజనీరింగ్ అధికారులు కొందరు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి నీరు-చెట్టు కింద చేయని పనులకు ఎంబుక్ రికార్డులు చేసి బిల్లులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి ప్రజాధనం మింగేశారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ఈ ఏడాది జూన్ 12న కొలువదీరిన టీడీపీ కూటమి ప్రభుత్వం నీరు-చెట్టు బిల్లులు చెల్లింపులు మరోసారి హెడ్ ఆఫ్ అకౌంట్ ఓపన్ చేశారు. అయితే.. కోర్టులో డబ్ల్యూపీ, కంటెంప్ట్ ఆఫ్ కోర్టు కేసులు ఉన్న బిల్లులు మాత్రమే అప్‌లోడ్ చేయాలని నిబంధనలు పెట్టినా ఇష్టారాజ్యంగా చేయని పనుల బిల్లులు కూడా అప్‌లోడ్ చేసి దాదాపు రూ.10 కోట్లకు పైగా నీరు-చెట్టు నిధులు స్వాహా చేశారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో చక్రం తిప్పిన కీలక అధికారి పాత్ర ఇందులో ఉందని జలవనరుల శాఖలో ప్రధానంగా చర్చ జరుగుతున్నది.

ఇలా వెలుగులోకి వచ్చింది..

మైనర్ ఇరిగేషన్ విభాగంలో ఓ మండలంలో పని చేసిన ఇంజనీరు ఒకరు 2022లో మరో డివిజన్‌కు బదిలీపై వెళ్లారు. ఆ సమయానికి నీరు-చెట్టుకు సంబంధించిన మూడు బిల్లులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. ఆ రికార్డులను అప్పగించి రిలీవ్ అయ్యారు. కట్ చేస్తే.. రెండేళ్ల తరువాత వారం పది రోజుల క్రితం ఫలాన కాంట్రాక్టరు చేసిన పనులకు ఎందుకు బిల్లులు చెల్లించలేదో సమాధానం ఇవ్వాలని కోర్టు నుంచి నోటీస్ వచ్చింది. అసలు ఆ పనే చేయలేదు.. బిల్లులు చెల్లించాలని కోర్టు నోటీస్ ఇవ్వడమేమిటి..? అని విచారిస్తే.. తన ప్రమేయం లేకుండానే ఫోర్జరీ డాక్యుమెంట్లతో చేయని పనులకు బిల్లులు అప్‌లోడ్ చేసి బిల్లులు స్వాహా చేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఆ మండలంలో ఒక్కటే కాదు.. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలో డోన్, బేతంచర్ల, వెల్దుర్తి, కృష్ణగిరి, ఆస్పరి, గోనేగండ్ల, ఆదోని మండలాల్లో మైనర్ ఇరిగేషన్ విభాగంలో నీరు-చెట్టు కింద మంజూరై.. గంపెడు మట్టి కూడా తీయని పనులు గుర్తించి ఫోర్జరీ డాక్యుమెంట్లు సృష్టించి బిల్లులు అప్‌లోడ్ చేసి వందకు పైగా పనులకు సంబంధించి సుమారుగా రూ.10 కోట్లకుపైగా అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అత్యధికంగా డోన్, బేతంచర్ల మండలాల్లో అక్రమాలు జరిగితే.. ఆ తరువాత స్థానాల్లో గోనెగండ్ల, ఆస్పరి, ఆదోని మండలాలు ఉన్నాయని సమాచారం. చేయని పనులకే కాదు.. గతంలో బిల్లులు తీసుకున్న పనులకు కూడా రెండోసారి ఫోర్జరీ సంతకాలతో బిల్లులు పెట్టి నిధులు స్వాహా చేశారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి.

విజిలెన్స్ విచారణ చేస్తే భారీ కుంభకోణం:

జిల్లాలో వైసీపీ ప్రభుత్వం వచ్చాక అప్‌లోడ్ చేసిన నీరు-చెట్టు బిల్లులు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో సమగ్ర విచారణ చేస్తే పనులు చేయకుండానే బిల్లులు స్వాహా చేసిన భారీ కుంభకోణం వెలుగు చూసే అవకాశం ఉందని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాని పలువురు కోరుతున్నారు. అయితే.. ఈ కుంభకోణం వెలుగులోకి రావడంతో అవినీతి అధికారుల్లో దడ మొదలైంది.

విచారణ చేస్తున్నాం

నీరు-చెట్టు పనుల్లో చేయని పనులకు కూడా బిల్లులు పెట్టి నిధులు డ్రా చేశారనే ఆరోపణలు వచ్చిన మాట నిజమే. దీనిపై విచారించి జిల్లా అధికారులకు నివేదిక అందజేస్తాం.

- బి. బాలచంద్రారెడ్డి,
ఎస్ఈ, జలవనరుల శాఖ, కర్నూలు

నడిరోడ్డుపై అమ్మ

(5వ పేజీ తరువాయి)

- చలిలో బిక్కుబిక్కుమంటూ వృద్ధురాలు
- తల్లిని తీసుకెళ్లని కుమార్తె, అల్లుడు
- అవసాన దశలో అమ్మకు అవస్థలు

పత్తికొండ, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): శనివారం తెల్లవారుజామున 5 గంటల సమయం. పత్తికొండ పట్టణం ట్రాన్స్‌కో కార్యాలయం సమీపంలోని ఓ కాలనీలో నడవలేని స్థితిలో ఉన్న 75 ఏళ్ల వృద్ధురాలు ప్లాస్టిక్ కుర్చీపై చలికి వణికిపోతూ బిక్కుబిక్కుమంటూ కూర్చొని ఉంది. కనీసం లేచి అడుగు తీసి అడుగు కూడా వేయలేని పరిస్థితి ఆమెది. వీధిలో వాళ్లు 'ఏం అవ్వా.. ఎవరు నువ్వు ఇక్కడ కూర్చున్నావు..' అంటూ అడిగే సరికి కళ్లలో నీళ్లు తిరిగే సమాధానమిచ్చింది ఆ వృద్ధురాలు. 'అర్ధరాత్రి నా కొడుకు ఆటోలో తీసుకొచ్చి ఈడ వదిలేసి పోయినాడమ్మా. అరవలేను. పిలవలేను. నడవలేను తల్లీ కాసిన్ని నీళ్లు ఇవ్వండమ్మా..' అంటూ కన్నీటి సుడులతో ఆ వృద్ధురాలి నుంచి పొడిపొడిగా వచ్చిన మాటలివి. వివరాల్లోకెళ్తే... అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన తిరుపతమ్మకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు సంతానం. కుమారుడు శ్రీనివాసులు గుంతకల్లులో ట్రావెల్స్ నిర్వహిస్తున్నాడు. పెద్దకుమార్తె పత్తికొండలో, చిన్న కుమార్తె బళ్లారిలో ఉంటున్నారు. ఎవరికీ భారం కాకూడదని భావించిన తిరుపతమ్మ బళ్లారిసమీపంలో ఓ వృద్ధాశ్రమంలో చేరి తనకు వచ్చే పింఛన్‌పైనే ఆధారపడి జీవించేది. ఇటీవల కిందపడి గాయపడిన ఆమె మంచంపాలైంది. దీంతో చిన్నకూతురు, కుమారుడు ఖర్చులు భరించి ఆపరేషన్ చేయించారు. ఆపరేషన్ తర్వాత గుంతకల్లులో కొడుకు ఇంటివద్దే తిరుపతమ్మ ఉంటోంది. ఈ క్రమంలో భారమైన తల్లిని కుమార్తె వద్దకు వెళ్లాలంటూ కొడుకు శ్రీనివాసులు తిరుపతమ్మను గుంతకల్లు నుంచి పత్తికొండకు అర్ధరాత్రి ఆటోలో తీసుకొచ్చాడు. ఓ ఇంటి ఎదుట ప్లాస్టిక్ కుర్చీలో తల్లిని కూర్చోబెట్టి.. 'ఇదే నీ పెద్ద కూతురు ఇల్లు. తెల్లవారి వాళ్లు నిద్రలేచాక నిన్ను ఇంట్లోకి తీసుకెళ్తారు..' అని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. దీంతో రాత్రంగా చలిలో వణుకుతూ బిక్కుబిక్కుమంటూ అక్కడే ఉండిపోయింది. ఉదయం కాలనీ వాసులు వృద్ధురాలికి సపర్యలు చేసి అల్పాహారం తినిపించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ జయన్న అక్కడకు చేరుకుని వృద్ధురాలు తిరుపతమ్మ వద్ద వివరాలు సేకరించారు. పక్క వీధిలోనే ఉన్న కుమార్తె, అల్లుడికి సమాచారం ఇచ్చి పిలిపించి ఇంటికి తీసుకెళ్లాలని సూచించారు. అయితే తల్లిని తన ఇంటికి తీసుకెళ్లేందుకు కుమార్తె నిరాకరించింది. కుమారుడు శ్రీనివాసులుకు పోలీసులు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వస్తోంది. తల్లిని ఆదరించాల్సిన కొడుకు అర్ధరాత్రి నడిరోడ్డుపై తల్లిని వదిలేయడం, కుమార్తె ఇంటికి తీసుకెళ్లేందుకు ససేమీరా అనడంతో ఆ వృద్ధురాలిని 108 అంబులెన్స్‌లో పోలీసులు పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుమారుడు, ఇద్దరు కుమార్తెలను పిలిపించి విచారిస్తామని సీఐ జయన్న తెలిపారు. ఆమెకు ఆశ్రయం కల్పించేలా చూస్తామని తెలిపారు.



తిరుపతమ్మ నుంచి వివరాలు నమోదు చేసుకుంటున్న సీఐ జయన్న

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం: ఆర్డీవో



మాట్లాడుతున్న కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్

కర్నూలు హాస్పిటల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, ఆడ శిశువులను గర్భంలోనే తుడిచివేయడం చట్టరీత్యా నేరమని కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్ అన్నారు. శనివారం సాయంత్రం కర్నూలు ఆర్డీవో కార్యాలయంలో పీసీపీఎన్‌డీటీ సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటీ సమావేశం ఆర్డీవో ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ ఆడ శిశువులను కాపాడేందుకు కృషి చేయాలని కోరారు. కొత్త స్కానింగ్ కేంద్రాలు, కొత్త రిజిస్ట్రేషన్లు, రెన్యువల్‌కు దరఖాస్తు చేసుకున్న వాటిని ప్రోగ్రాం ఆఫీసర్లు తనిఖీ చేయాలని ఆదేశించారు. తనిఖీల రిపోర్టులను పీసీపీఎన్‌డీటీ జిల్లా స్థాయి కమిటీకి సమర్పించి ఆమోదం పొందాలన్నారు. జూనియర్ కళాశాలలు, హైస్కూల్, పాఠశాలల్లో ఆడపిల్లల ప్రాముఖ్యతపై అవగాహన పెంచాలన్నారు. గర్భస్థ లింగ నిర్ధారణ గురించి ఎవరికి మాటల ద్వారా గానీ, సైగల రూపంలో గానీ, చేతుల రూపంలో గానీ చెప్పకూడదన్నారు. కార్యక్రమంలో పీసీపీఎన్‌డీటీ జిల్లా నోడల్ ఆఫీసర్ డీఐవో డా.నాగప్రసాద్, గైనకాలజిస్టు డా.సంధ్య, డెమో శ్రీనివాసులు, ఎస్ఐ సోమశేఖర్, డివిజనల్ పీఆర్వో శివకుమార్ యాదవ్, ఎన్జీవోలు రాయపాటి శ్రీనివాసులు, మద్దిలేటి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

9న నంద్యాల పాలిటెక్నిక్ కళాశాల

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మాట్లాడుతున్న హరినాథగుప్త

నంద్యాల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఈ నెల 9న కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల పూర్వ విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథగుప్త తెలిపారు. శనివారం కళాశాలలో పూర్వ విద్యార్థుల అసోసియేషన్ నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కళాశాల 1960లో స్థాపితమైందన్నారు. మొదటి బ్యాచ్ 1963నుంచి ప్రస్తుత విద్యాసంవత్సరం వరకు అన్ని బ్యాచ్‌లను కలుపుకొని పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కళాశాలలో చదివిన విద్యార్థులు దేశ, విదేశాల్లో వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకొని విద్యనభ్యసించిన కళాశాల అభివృద్ధికి వెన్నుదన్నుగా నిలుస్తున్నారని కొనియాడారు. రూ.30లక్షలు పూర్వ విద్యార్థుల నుంచి నిధులు సేకరించి కళాశాలలోని తరగతి గదులు, ల్యాబ్‌లు, వర్క్‌షాప్‌లు, మౌలిక వసతులను అన్ని హంగులతో ఏర్పాటు చేశారన్నారు. 9వ తేదీన జరిగే పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు అందరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అవుకు, ఆదోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల ప్రిన్సిపాల్స్ వెంకటేశ్వర్లు, రామసుబ్బారెడ్డి, అధ్యాపకుడు రఘునాథరెడ్డి, ఉమామహేశ్వరప్ప, కళాశాల సెక్షన్ హెచ్‌ఓడి సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.7.50 లక్షల ఉపకార వేతనాల పంపిణీ

గుంటూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని 'కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్ ', 'రోపా - కర్నూలు" వారి సంయుక్త ఆధ్వర్యంలో చదువులో అత్యుత్తమ ప్రతిభ చూపిన 160 మంది పేద విద్యార్థులకు రూ.7.50 లక్షల ఉపకార వేతనాలుగా పంపిణీ చేయనున్నారు. ఇందులో రూ. 3 లక్షల 75వేలు తులసీ సీడ్స్ వారు, కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్ ద్వారా పేద విద్యార్థులకు అందిస్తున్నారు. కర్నూలులోని రావూరి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తులసి గ్రూప్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు హాజరై ఉపకార వేతనాలను పంపిణీ చేయనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

కొణిదెలలో కొండచిలువ



నందికొట్కూరు రూరల్ అక్టోబరు 2(ఆంధ్రజ్యోతి) : నందికొట్కూరు మండలంలోని కొణిదెల గ్రామంలో ఇళ్ళ మధ్యకు కొండ చిలువ వచ్చింది. శనివారంనందికొట్కూరు మండలంలోని కొణిదెల గ్రామంలో బస్టాండ్ వద్ద గల కట్టెల డిపో వద్ద గొల్ల నాగశేషులు, బషీర్, దౌలత్ ఇళ్ల వద్ద కొండచిలువ కనిపించింది. దీంతో స్థానికులు భయాం దోళనకు గురయ్యారు. ఎఫ్‌డీఆర్వో తాహెర్ స్నేక్ క్యాచర్ రామును పిలిపించి కొండచిలువను పట్టించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

తెల్లారిన బతుకులు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి



ఆటో నుంచి కిందపడిన చిన్నారి



ప్రభుత్వ ఆస్పత్రి ప్రాంగణంలో రోదిస్తున్న బంధువులు

5వ పేజీ తరువాయి

ఎమ్మిగనూరు/నందవరం, నవంబరు2 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పట్టణానికి చెందిన ముల్లా గనిబాషా అతడి భార్య ముల్లా బీబీ(32), ఇద్దరు పిల్లలు నబియా, ఖాజావలి అమావాస్య కావడంతో సొంత ఆటో తీసుకొని ఆదోని సమీప లోని సుల్తానా పురంలో ఉన్న దర్గాలో రాత్రి నిద్రచేసేందుకు వెళ్లారు. శనివారం తెల్లవారుజామున స్వగ్రామమైన మంత్రాలయానికి ఆటోలో తిరుగు ప్రయాణమయ్యారు. అదేవిధంగా నందవరం మండలం హాలహర్వి గ్రామానికి చెందిన గౌరమ్మ(60), కురువ వీర నాగమ్మ(65) మండల కేంద్రమైన నందవరంలో ఉన్న బీరప్పస్వామి దేవాల యంలో అమావాస్య రోజు రాత్రి నిద్రచేసి తిరిగి స్వగ్రామమైన హాలహర్వికి ప్రయాణ మయ్యారు. నందవరం నుంచి ఎమ్మిగనూరుకు వెళ్తున్న ఆటోలో వచ్చి ముగతి క్రాస్ రోడ్డు దగ్గర దిగి మంత్రా లయానికి వెళ్తున్న గనిబాషా ఆటోలో హాలహర్వికి బయల్దేరారు.

ఆటో బయల్దేరిన కొన్ని నిమిషాలకే బెంగళూరు నుంచి మంత్రాలయానికి వెళ్తున్న కారు(కె.ఏ05 ఏఎం4196) అతివేగంగా ఆటోను వెనుక నుంచి ఓవర్‌టేక్ చేసేందుకు వెళ్తు ఢీకొట్టింది. ఒక్కసారిగా రోడ్డుపైనుంచి ఆటో పక్కనున్న పొలాల్లోకి ఎగిరిపడింది. కారు సైతం పొలాల్లోకి దూసుకెళ్లింది. ఆటోలో ప్రయాణిస్తున్న హాలహర్వికి చెందిన వీరనాగమ్మ, మంత్రాలయానికి చెందిన ముల్లాబీబీ(32) తీవ్ర గాయాలపాలుకాగా వీరనాగమ్మ అక్కడికక్కడే దుర్మరణం పాలైంది. ముల్లా బీబీని ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. అదేవిధంగా కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న గౌరమ్మను అంబులెన్స్‌లో కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. దీంతో ఆమె మృతదేహాన్ని తిరిగి ఎమ్మిగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువచ్చారు. ఆటో నడుపుతున్న ముల్లాగని బాషా కాలుకు తీవ్రగాయాలుకాగా చిన్నారులు నబియా, ఖాజావలిలకు రక్తగాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

సురక్షితంగా బెంగళూరు వాసులు

బెంగళూరు నుంచి దైవ దర్శనం కోసం మంత్రాలయానికి వస్తూ ప్రమాదానికి గురైన బెంగళూరువాసులు స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు. కర్ణాటక వాసులు నలుగురు కారులో శుక్రవారం రాత్రి మంత్రాలయానికి బయల్దేరారు. శనివారం ఉదయం మంత్రాలయం హైవేలోని ధర్మాపురం టోల్‌గేటు సమీపంలో ముందుగా వెళ్తున్న ఆటోను క్రాస్‌చేయబోయి అతివేగంగా కారుతో ఢీకొట్టారు. అయితే కారులో ప్రయాణిస్తున్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కారు డ్రైవర్ మహేశ్‌తో పాటు, యజమానిపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆసుపత్రిలో మిన్నంటిన రోదనలు

ప్రమాద ఘటన సమాచారం తెలుసుకున్న మృతుల బంధువులు పెద్ద ఎత్తున ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. తమ బంధువులు మృతి చెందారన్న విషయం తెలుసుకుని కన్నీటిపర్యంతమయ్యారు. ఆసుపత్రి ప్రాంగణం మృతుల బంధువుల రోదనలతో మిన్నంటింది. వ్యవసాయకూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తున్న హాలహర్వి గ్రామానికి చెందిన వీరనాగమ్మ, గౌరమ్మ ప్రమాదంలో మృతి చెందటంతో హాలహర్విలో ఒక్క సారిగా విషాదచాయలు అలముకున్నాయి. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్ర బాబు, సీఐ విక్రమసింహ, నందవరం ఎస్ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దాసుపత్రిలో ఆక్సిజన్ లీకేజీ

కర్నూలు హాస్పిటల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జీజీహెచ్‌లోని చిన్న పిల్లల విభాగం వద్ద గత రెండు రోజులుగా పైపుల నుంచి ఆక్సిజన్ లీకేజీ అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. లీకేజీ వల్ల పెద్దగా శబ్దం వస్తోందని రోగులు ఫిర్యాదు చేశారు. ఆక్సిజన్ లీకేజీ అవుతుండటంతో ప్రజల సొమ్ము వృథా అవుతుందని కొందరు విమర్శిస్తున్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కె. వెంకటేశ్వర్లు, ఏపీ ఎంఎస్ఐడీసీ ఈఈ శివకుమార్, సివిల్ సర్జన్ అడ్మినిస్ట్రేటర్ డా. బీవీ రావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డా.బి.హేమనళినితో సమీక్ష నిర్వహించారు. సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు ఎమర్జెన్సీ మెడిసిన్ హెచ్‌వోడీ డా.రామశివనాయక్, లీకేజీని పరిశీలించి నివేదిక అందజేశారు.



ఆక్సిజన్ లీకేజీని పరిశీలిస్తున్న రామశివనాయక్

'కోర్టు కానిస్టేబుళ్లు చిత్తశుద్ధితో పనిచేయాలి'

నంద్యాల క్రైం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): కేసుల నిరూపణలో చిత్తశుద్ధితో పనిచేయాలని పోలీస్ అధికారులు సూచించారు. ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు శనివారం జిల్లాలోని వివిధ కోర్టుల కానిస్టేబుళ్లు, కోర్టు మానిటరింగ్ సిబ్బందితో జిల్లా పోలీస్ కార్యాలయంలో కోర్టు మానిటరింగ్ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరయ్య సమావేశం నిర్వహించారు. కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు మానిటరింగ్ సిస్టం అధికార సిబ్బంది కేసు నమోదు చేయడం, నిందితులను అరెస్ట్ చేయడం, చార్జిషీట్ వేయడం ఒక ప్రక్రియ అయితే కోర్టులో విధివిధానాలు సరిగా పాటించి కేసులను నిరూపణ చేయడంలో కీలకంగా వ్యవహరించాలని సూచించారు. నాన్‌బెయిలబుల్ వారెంట్స్ పెండింగ్ లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించి ఎప్పటికప్పుడు సర్వ్ చేయాలన్నారు. పాత పెండింగ్ కేసులపై శ్రద్ధ చూపి వారెంట్ సర్వ్‌చేయాలని, పోలీసుల అలసత్వంవల్ల కోర్టుల్లో విచారణ పెండింగ్ లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. కేసుల విచారణ సమయంలో సాక్షులు, సాక్ష్యాధారాలు, రికార్డులను కోర్టు కానిస్టేబుళ్లు కోర్టుల్లో పొందుపరచాలని సూచించారు.

చెరువులను నింపడంలో విఫలం

- వరద నీరంతా సముద్రంలోకే
- రైతులకు సకాలంలో విత్తనాలు పంపిణీ చేయాలి
- జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి
- ముగిసిన జడ్పీ స్థాయి సంఘ సమావేశాలు



సమావేశంలో పాల్గొన్న సభ్యులు, ఇన్‌సెట్‌లో చైర్మన్ పాపిరెడ్డి

కర్నూలు, న్యూసిటీ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు ఉమ్మడి జిల్లాలోని జలాశయాల్లో నీటి మట్టం పెరిగినా.. చెరువులను నింపడంలో అధికారులు ఘోరంగా విఫలం చెందారని జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. ఇప్పటికైనా జలవనరుల శాఖ అధికారులు చొరవ తీసుకుని అన్ని చెరువులను నింపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా పరిషత్ మినీ సమావేశం భవ నంలో ఏడు స్థాయి సంఘ సమావేశాలు జరిగాయి. చైర్మన్ అధ్యక్షత వహించగా సీఈవో జి. నాసరరెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ శ్రీశైలం, సాగర్, కృష్ణా బ్యారేజీల్లో పూర్తి స్థాయి నీటి మట్టం ఉందన్నారు. అయినా జిల్లాలోని చెరువులను నింపలేక పోవడం దారుణమన్నారు. గ్రామాలలో వీధిలైట్లు 24 గంటలు వెలుగుతున్నాయని, నీరు వృథాగా పోతోందని, వీటిని పర్యవే క్షించాలని అన్నారు. ఆగస్టు 15న ఫోన్ చేసే వరకు విత్తనాలు పంపిణీ చేయకపోవడంపై వ్యవసాయ అధికారిపై చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఒకే ఒక్క తీర్మానం..

దివ్యాంగుల సర్టిఫికెట్ కోసం నిర్వహించే సదరం క్యాంపు గురించి సమావేశంలో చర్చ జరిగింది. పలువురు జడ్పీటీసీలో ఈ అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. జిల్లాల్లో సదరం క్యాంపు నిర్వహించేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని సమావేశంలో తీర్మానం చేశారు. డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బారెడ్డి, జడ్పీటీసీలు దివ్య, సుధాకర్‌రెడ్డి, సుంకన్న, పోచా జగదీశ్వరరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అనసూయమ్మ, ఉమ్మడి జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

జడ్పీటీసీలు ఏమన్నారంటే...

తమ ప్రభుత్వ హయాంలో మండలాలకు అభివృద్ధి నిధులు మంజూరు కాలేదని, కూటమి ప్రభుత్వమైనా నిధులు ఇచ్చి ఆదుకోవాలని వైసీపీకి చెందిన జడ్పీటీసీలు అన్నారు. సమావేశంలో పాల్గొన్న జడ్పీటీసీలు మాట్లాడుతూ పాఠశాలల్లో వంట చేసే కార్మికులను బదిలీ చేయరాదన్నారు. కొత్తపల్లి మండలంలో ఫీల్డు అసిస్టెంట్లు క్షేత్రస్థాయిలో పని చేయడం లేదని, అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని ఆవేదన చెందారు.

మనుషుల ప్రాణాలు పోతున్నాయి



నంద్యాల చెక్‌పోస్టు నుంచి గార్గేయపురం వరకు రోడ్డు పనులు నత్తనడకన సాగుతు న్నాయి. నంద్యాల చెక్‌పోస్టు నుంచి 2 కి.మీ రోడ్ల విస్తరణ పనులు చేపట్టకపోవడంతో మనుషుల ప్రాణాలు పోతున్నాయి. మొదట్లో 120 అడుగుల రోడ్డు విస్తరణ చేపట్టాలన్నారు. అయితే నగర పాలక అధికారులు కేవలం 100 అడుగులు మాత్రమే రోడ్ల విస్తరణ చేపట్టాలని అంటున్నారు. ఇందులో ఏది నిజమో తేల్చిచెప్పాలి.

- గౌరు చరితారెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే

సంక్షేమ హాస్టళ్లలో అవకతవకలు జరుగుతున్నాయి



ఉమ్మడి జిల్లాలోని సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో అవకతవకలు జరుగుతున్నాయి. విద్యార్థులకు వసతుల విషయంలో రాజీప డవద్దు. కొందరు అధికారులు సరిగ్గా విధులు నిర్వహించడం లేదు. వచ్చే సమావేశంలో వారి వివరాలను తీసుకుని వస్తాను. 2018-19 టీడీపీ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ నూతన భవన నిర్మాణాలు ప్రారంభమ య్యాయి. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాక నిర్మాణాలు ఆగిపోయాయి. అవి ఏ దశలో ఉన్నాయో పూర్తి వివరాల ఇవ్వాలి.

- గిత్తా జయసూర్య, నందికొట్కూరు ఎమ్మెల్యే

పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి



నియోజకవర్గంలోని కొన్ని పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి. గదులు నిర్మాణం పూర్తి కాకపోవడంతో విద్యార్థులు చెట్ల కింద పాఠాలు నేర్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. నాడు-నేడు కింద బడ్జెట్ ఉంటే పాఠశాలలో మరమ్మతులు చేపట్టాలి. కొన్ని పాఠశాలల్లో టీచర్ల కొరత ఉంది. గూడూరు ఎస్సీ హాస్టల్‌లో సమస్యలు న్నాయి. కొత్త పీహెచ్‌సీ భవనాలను వేగంగా పూర్తి చేయాలి. కోడుమూరు ప్రభుత్వ ఆసుపత్రిలో మందుల కోసం బయటికి పంపిస్తున్నారు దీనిపై విచారణ చేపట్టాలి.

- బొగ్గుల దస్తగిరి, కోడుమూరు ఎమ్మెల్యే

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలి : నాగరాజు, ఎంపీ



కర్నూలు పార్లమెంటు పరిధిలో విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. పశ్చిమ ప్రాంతంలో వలసలను నివారించడానికి అందరినీ విద్యావంతులను చేయాలి. పాఠశాలల్లో వసతులు కల్పించాలి. హాస్టళ్ల, రెసిడెన్షియల్ పాఠశాలు మరికొన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. కోసిగి మోడల్ పాఠశాలలో ఫ్లోర్ శిథిలావస్థకు చేరింది. ఆలూరు ప్రసూతి కేంద్రాల్లో కనీస వసతులు కల్పించాలి.

త్రీమెన్ కమిటీ ఎక్కడ..?

- మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేయని అధికారులు
- ఏజెన్సీల మార్పు కోసం హెచ్‌ఎంలపై పెరుగుతున్న ఒత్తిడి
- ఆలూరు మోడల్ స్కూల్‌లో పోటీ పడ్డ రెండు గ్రూప్‌లు



ఆలూరు మోడల్ స్కూల్‌లో వంట చేస్తున్న నిర్వాహకులు

ఆలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంపై పర్యవేక్షణ కరువైంది.. త్రీమెన్ కమిటీ సభ్యులైన తహసీల్దార్, ఎంఈవో, ఎంపీడీవో స్కూళ్లను తనిఖీ చేసి పరిశీలించిన దాఖలాలు లేవు. దీంతో మధ్యాహ్న భోజనం తీరు కొన్ని పాఠశాలల్లో అధ్వానంగా మారింది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మధ్యాహ్న భోజన ఏజెన్సీలను తమకు ఇవ్వాలంటూ టీడీపీ నాయకులు పట్టుబడుతున్నారు. ఈ మేరకు హెచ్‌ఎంలపై ఒత్తిడి తీసుకు వస్తున్నారు.. జిల్లాలో ఈ వివాదం తీవ్రమైంది. అకారణంగా తమ పార్టీ వర్గీయుల ఏజెన్సీలను టార్గెట్ చేసి ఎలా మారుస్తారని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ప్రశ్నిస్తున్నారు. త్రీమెన్ కమిటీ సభ్యులతో సంతకాలు చేయించి ఏజెన్సీలను తొలగించే ప్రయత్నాలు ఆరంభించారు.. ఆలూరు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఏజెన్సీని మార్చేందుకు యత్నించగా పాత ఏజెన్సీ నిర్వాహ కురాలు సునీత ససేమిరా అనడంతో పాటు కారణం లేకుండా ఎలా తొలగిస్తారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో చేసేదేమి లేక ఇద్దరికీ భోజన ఏజెన్సీ బాధ్యతలు ఇచ్చి ఒక్కో నెలకొకరు భోజనం చేసేలా ఒప్పందం కుదిర్చారు.

ఆలూరు మోడల్ స్కూల్‌లో పోటీపడ్డ రెండు ఏజెన్సీలు

ఆలూరు మోడల్ స్కూల్‌లో ప్రస్తుతం ఉన్న భాగ్యలక్ష్మి ఏజెన్సీకి బదులు లక్ష్మి పొదుపు సంఘం భోజనం చేసేందుకు ప్రిన్సిపాల్ రాఘవరావు అనుమతి ఇస్తూ బియ్యం కూడా ఇచ్చారు. అయితే భాగ్యలక్ష్మి ఏజెన్సీ నిర్వాహకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ మేము వంట చేస్తున్నామని, కారణం లేకుండా ఎలా తొలగిస్తారని ప్రశ్నించారు. త్రీమెన్ కమిటీ ఆదేశాల మేరకు ఏజెన్సీను మార్చి వేరే ఏజెన్సీతో మధ్యాహ్న భోజనం చేయిస్తున్నామని ప్రిన్సిపాల్ చెప్పినప్పటికీ అంగీకరించలేదు. ఇంట్లో నుంచి బియ్యం తెచ్చి వంట వండి పిల్లలకు వడ్డించారు. తమకు రావాల్సిన రెండు నెలల బిల్లులు చెల్లించి నాలుగు నెలల వ్యవధి ఇవ్వాలంటూ భాగ్యలక్ష్మి ఏజెన్సీ నిర్వాహకులు అంటున్నారు. త్రీమెన్ కమిటీ ఒక్క రోజు కూడా స్కూల్‌కు వచ్చి భోజన పథకాన్ని పరిశీలించలేదని, అలాంటప్పుడు భోజనం బాగాలేదని ఎలా నిర్ణయిస్తారని ప్రశ్నిస్తున్నారు. భోజన ఏజెన్సీల మార్పు హెచ్‌ఎంలకు తలనొప్పులు తెచ్చి పెడుతున్నాయి.

మతిస్థిమితంలేని మహిళపై అత్యాచార యత్నం

- గోనెగండ్ల మండలంలో ఘాతుకం...
- కేసు నమోదు చేసిన పోలీసులు

గోనెగండ్ల, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓ గ్రామంలో పుట్టకతో రెండు కాళ్లు లేని, మాటలు రాని, చెవులు వినిపించని, మతిస్థిమితం లేని మహిళపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి అత్యాచార యత్నం చేశాడు. ఆకలి వేస్తే అన్నం కూడా అడగలేని స్థితిలో ఉన్న మహిళకు ఇంట్లోవారే అన్నం తినిపించాలి. అటువంటి 24ఏళ్ల వయసు ఉన్న మహిళపై అత్యాచార యత్నం జరిగినట్లు ఒక రోజు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

శుక్రవారం ఈ మహిళ తల్లిదండ్రులు పొలం పనులకు వెళ్లారు. మతిస్థిమితం లేని కూతురుకు అన్నం తినిపించేందుకు చిన్న కూతురును ఇంటి దగ్గర ఉంచారు. ఆ మహిళ ఆరుబయట బాత్‌రూం దగ్గర కూర్చొని ఉండటం చూసిన బోయ రాముడు ఆమెపై అత్యాచార యత్నం చేశాడు. ఆమె అరవడంతో చెల్లెలు బైటికి వచ్చింది. ఈ విషయం ఎవరికైనా చెప్పావంటే చంపేస్తానని ఆమెను బెదిరించి పారిపోయాడు. బాధితురాలి తల్లి స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

క్లబ్ సంగతేమిటి..?

- ఆలూరు క్లబ్ వ్యవహారంపై ఎస్పీ అరా..!

ఆలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఆలూరు కాస్మోపాలిటన్ క్లబ్ వివాదంపై శనివారంపై ఎస్పీ బిందు మాధవ్ అరా తీశారు.. క్లబ్ ఎందుకు మూత పడింది. అందులో ఆధిపత్యం కోసం రాజకీయం చేస్తున్నదెవరు? క్లబ్ మూత పడటం వల్ల ఇబ్బంది పడుతున్నదెవరు? క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా పదవులు ఆశిస్తున్నది ఎవరు? ఏ నాయకుడు ఎవరిని ప్రతిపాదిస్తున్నారు? అనే విషయాలపై పూర్తి వివరాలతో నివేదిక ఇవ్వాలని ఆలూరు పోలీసులను ఆదేశించినట్లు సమాచారం. మరోవైపు మూతపడిన క్లబ్‌ను తెరిపించాలని క్లబ్ సభ్యులు గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూర్ జయరాంను కలిశారు.. దీంతో ఎస్పీకి ఫోన్ చేసిన ఆయన క్లబ్‌లో కేవలం కాలక్షేపం కోసం వృద్ధులు, రిటైర్డ్ ఉద్యోగులు కూర్చుంటారే తప్ప మద్యం ఎవ్వరూ సేవించరని, క్లబ్ మూత పడటంతో రిటైర్డ్ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయంపై ఆలోచిస్తామని ఎస్పీ చెప్పినట్లు సమాచారం

ఘర్షణ.. ఇద్దరికి గాయాలు

పాణ్యం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక జుర్రాగు సమీపంలో శనివారం జరిగిన దాడి ఘటనలో బీటెక్ పుల్లారెడ్డి, ఆయన కుమారుడు గాయపడినట్లు పాణ్యం ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు.. కంకర మిషన్ పంచాయితీలో తన గురించి చెడుగా ప్రచారం చేస్తున్నావని తమ్మరాజుపల్లెకు చెందిన పెద్ద షేక్షావలి గత నెల 31వ తేదీన పుల్లారెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. పాణ్యం రావాలని పుల్లారెడ్డి చెప్పడంతో పెద్ద షేక్షావలి, బాలరాజు, షేక్షావలితో పాటు మరి కొందరు శనివారం పాణ్యానికి వచ్చారు. స్థానిక జుర్రాగు వద్ద క్రషర్ గురించి మాట్లాడుతూ మాటమాట పెరిగి ఇరువురి మధ్య వివాదం పెరిగి దాడులకు పాల్పడడంతో పుల్లారెడ్డికి, కుమారుడు లక్ష్మణ్ శివసాయికి గాయాలైనట్లు తెలిపారు. దాడికి పాల్పడిన పెద్ద షేక్షావలి, బాలరాజు, షేక్షావలితో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైతులకు కంప్యూటర్ బిల్లు ఇవ్వాలి

- పేపర్లపై రాసి ఇస్తే చర్యలు
- సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి హెచ్చరిక



మాట్లాడుతున్న సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పంట ఉత్పత్తులను కొనుగోలు చేసిన తర్వాత రైతులకు కంప్యూటర్ బిల్లు ఇవ్వాలని, కాగితాలపై రాసి ఇస్తే చర్యలు తీసుకుంటామని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి వ్యాపారులను, కమీషన్ ఏజెంట్లను హెచ్చరించారు. శనివారం తన కార్యాలయంలో అదనపు సెక్రటరీలు రెహిమాన్, వెంకటేశ్‌తో పాటు సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న, నాగేష్ తదితరులతో కలిసి అత్యవసర సమావే శాన్ని నిర్వహించారు. ఈనామ్‌లో సర్వర్ సమస్య పరిష్కారమైనందున ఇకపై ఎటువంటి ఆటంకాలు లేకుండా రైతులు తెచ్చే పంట ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు దృష్టి పెట్టాలని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆదేశించారు. ఎలక్ట్రానిక్ కాటాలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలని, తూకాల సమయంలో అదనపు సెక్రటరీలు, సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డులు తప్పనిసరిగా కాటాల వద్ద తూకాలు ఏ విధంగా వేస్తున్నారో పరిశీలించాలని ఆదేశించారు. రైతుల నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చినా తక్షణమే విచారణ జరిపి బాధ్యులైన కమిషన్ ఏజెంట్లు, వ్యాపారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు తెచ్చే పంట ఉత్పత్తులు కొనుగోళ్లు తదితర వివరాలను సక్రమంగా కంప్యూటర్ పేపరులో నమోదు చేయిస్తున్నామని, కమిషన్ ఏజెంట్లు వాటినే రైతులకు అందజేయాలని ఆదేశించారు. చిత్తు కాగితాలపై రాసి ఇస్తే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. రైతులు తప్పనిసరిగా పంట ఉత్పత్తులను గ్రేడింగ్ చేయించి కర్నూలు యార్డుకు తీసుకురావాలని, ఈ విషయంపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు.

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

వ్యాపారులకు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి


మాట్లాడుతున్న ఆర్‌జీవీ కృష్ణ

కర్నూలు న్యూసిటీ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని వాణిజ్య సంస్థలు, వ్యాపారులు తప్పకుండా నగర పాలక సంస్థ ట్రేడ్ లైసెన్సు తీసుకోవాలని అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ అన్నారు. శనివారం నగర పాలక కార్యాలయంలో ఆరోగ్య అధికారి కే. విశ్వేశ్వరరెడ్డితో కలిసి శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో ట్రేడ్ లైసెన్సుల జారీ, పునరుద్ధరణలపై డివిజన్ల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ మాట్లాడుతూ లైసెన్సు లేని వారు వెంటనే తీసుకోవాలన్నారు. లైసెన్సు ఫీజుల రూపంలో నగర పాలకలకు ఆదాయం రావాల్సి ఉందన్నారు. ఫీజుల వసూలు, ట్రేడ్ లైసెన్సుల జారీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ స్వర్ణలత, సిబ్బంది వీరకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్


అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు హాస్పిటల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): జాతీయ ఆరోగ్య కుటుంబ సంక్షేమ కార్యక్రమాలను సోషల్ మీడియా, పత్రికల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. శనివారం నగరంలోని రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో వైద్యఆరోగ్యశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే-డ్రైడేపై వీడియో ద్వారా అవగాహన కల్పించాలన్నారు. దోమల ద్వారా వ్యాపించి మలేరియా, డెంగీ, టీబీ, లెప్రసీ, తల్లిబిడ్డల మరణాల రేటు, ఎన్‌సీడీ ప్రోగ్రాంపై పూర్తి స్థాయిలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎల్.భాస్కర్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కే .వెంకటేశ్వర్లు, డీసీహెచ్‌ఎస్ మాధవి, జిల్లా మలేరియా అధికారి నూకరాజు, ఎన్టీఆర్ వైద్యసేవ జిల్లా కోఆర్డినేటర్ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ పథకాన్ని వినియోగించుకోండి: టీజీ భరత్

కర్నూలు అర్బన్: ప్రజలు ఉచిత గ్యాస్ పథకాన్ని వినియోగించుకోవాలని మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం ఒకటో వార్డులోని చిదంబరావు వీధి, ఖండేరి ప్రాంతాల్లో మంత్రి టీజీ భరత్ పర్యటించారు. డ్రైనేజీ, రోడ్లు, విద్యుత్ స్తంభాలు, వైర్ల సమస్యలను ప్రజలు మంత్రి దృష్టికి తెచ్చారు. వీధుల్లో పందుల బేడద, కుక్కల సమస్యలు ఎక్కువగా ఉందని, చిదంబరావు వీధిలో పురాతనమైన బిల్డింగ్ ప్రమాదకరంగా ఉందని స్థానికులు ఫిర్యాదు చేశారు. మంత్రి వెంట కమిషనర్ రవీంద్రబాబు, మున్సిపల్ అధికారులు, టీడీపీ కార్పొరేటర్లు, నాయకులు ఉన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు: కమిషనర్


రోడ్డును పరిశీలిస్తున్న కమిషనర్

కర్నూలు, న్యూసిటీ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ ఎస్.రవీంద్రబాబు తెలిపారు. శనివారం చౌరస్తా సమీపంలోని ఎస్‌ఏపీ క్యాంపు మీదుగా కొత్త రహదారి నిర్మాణానికి సంబంధించి మార్కింగ్‌ను రెండో పటాలం కమాండెంట్ ఎస్.మహబూబ్‌బాషాతో కలిసి కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ చౌరస్తా కూడలిలో ట్రాఫిక్ రద్దీని నివారించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. హైదరాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలను చౌరస్తా సమీపంలో ఎస్‌ఏపీ క్యాంపు మీదుగా ఆర్టీసీ బస్టాండు సమీపంలోకి వాహనాలను మళ్లించేందుకు రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం కమిషనర్ టీచర్స్ కాలనీ కమ్యూనిటీ హాల్, వెంకటేశ్వర వెంచర్ సమీపంలో రోడ్డు నిర్మాణ పనులు, వెంకట రమణ కాలనీలోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. ఆయన వెంట అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఏఈ నాగజ్యోతి ఉన్నారు.

రహదారులకు మహర్దశ

● రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభించిన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత


రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో రహదా రులకు మహర్దశ రానుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శనివారం నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలకు మరమ్మతు పనులను ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రోడ్లను ఏ మాత్రం బాగుచేయలేదని, పల్లెల నుంచి పట్టణాల రహదారులు అడుగుల మేర గోతులు ఏర్పడ్డాయన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోని రాగానే అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించిన సీఎం చంద్రబాబు రోడ్డు మరమ్మతు పనులకు నిధులు విడుదల చేశారని అన్నారు. జనవరి 31 లోపు పాణ్యం నియోజకవర్గంలోని రహదారుకు మరమ్మతు పనులు చేపట్ట నున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బీ డీఈ విజయ భారతి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్యే దస్తగిరి


గూడూరులో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

గూడూరు: రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. శనివారం మిషన్ పాట్‌హోల్ ఫ్రీ ఏపీ(గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం)లో భాగంగా గూడూరు మండలంలోని పెంచికలపాడు నుంచి కోడుమూరు రోడ్డు మరమ్మతులకు ఎమ్మెల్యే పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం తప్పి దాల వల్ల రాష్ట్రంలో రోడ్లు అధ్వానంగా మారాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జె సురేష్, గోపాల్ రెడ్డి, కృష్ణ, ఎంపీటీసీ మద్దిలేటి, కర్ణం చిన్న గిడ్డయ్య, హలీఫ్ బాషా, బంగారు శ్రీనివాసులు, ఆర్అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

పోలీసు లాంఛనాలతో
అనిల్‌కుమార్ అంత్యక్రియలు

సి.బెళగల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సీఆర్పీఎఫ్ పోలీసు అనిల్‌కుమార్ అంత్యక్రియలు శనివారం మండలంలోని కొండాపురం గ్రామంలో పోలీసు లాంఛనాలతో నిర్వహించారు. గ్రామానికి చెందిన అనిల్‌కుమార్ సీఆర్పీఎఫ్ పోలీసుగా మణిపూర్‌లో విధులు నిర్వహించేవారు. ఇటీవల సెలవుపై వచ్చి శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శనివారం సీఆర్పీఎఫ్ డీఎస్పీ, సీఐలు హాజరై పోలీసు లాంఛనాలతో అనిల్‌కుమార్ అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో సి.బెళగల్ హెడ్ కానిస్టేబుళ్లు, పోలీసులు పాల్గొన్నారు.







ఘనంగా రవీంద్ర డిగ్రీ కళాశాల వార్షికోత్సవం


నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): స్థానిక అబ్బాస్ నగర్‌లోని రవీంద్ర మహిళా డిగ్రీ కళాశాలలో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీనియర్ కన్సల్టెంట్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్, ర్యాంప్ వర్ల్డ్ బ్యాంకు ప్రాజెక్టు ఆఫ్ ఇండస్ట్రీస్ తెలంగాణ ఎం.తీగశ్రీ హాజరై ప్రసంగించారు. విద్యార్థినులు ఎంతో మంది ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎక్కువ సమయాన్ని వృథా చేసుకుంటున్నారన్నారు. వారు ఇన్నోవేషన్ ఐడియాలతో ముందుకు వస్తే ఆ ప్రాజెక్టుకు తగిన ఆర్థిక సాయం అందిస్తామన్నారు. రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాప కుడు జి.పుల్ల య్య మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని అన్నారు. అనంతరం విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు అందర్ని అలరించాయి. కార్యక్రమంలో కళాశాల డీన్, అకడమిక్ అడ్వైజర్ డాక్టర్ మమతా మోహన్, ప్రిన్సిపాల్ జ్యోతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

పేద ముస్లింలకు చెక్కుల పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఇబ్రహీం

కర్నూలు కల్చరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని వక్ఫ్‌బోర్డు కాంప్లెక్స్ చైర్మన్ ఇబ్రహీం ఆధ్వర్యంలో శనివారం ఐదుగురు ముస్లిం పేద యువతుల వివాహాలకు షాదీ తోఫా ఒక్కోకరికి రూ.3వేలు చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. రాబోయే రోజుల్లో ఈ తోఫా రూ.3 వేల నుంచి రూ. 5 వేలు పెంచుతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు రబ్బాని, మహబూబ్ పాల్గొన్నారు.

'బీసీల సమస్యలపై దృష్టి సారించాలి'

కర్నూలు అర్బన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): బీసీల సమస్యలపై పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ దృష్టి సారించాలని బీసీ జేఏసీ కన్వీనర్ బత్తుల లక్ష్మీకాంతయ్య కోరారు. శనివారం మంత్రికి దేవూజ ధనుంజయ్ ఆచారీ ఇతర నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో నిలిచిపోయిన బీసీ భవ నాన్ని పూర్తి చేయాలని, జోహరాపురం పరిధిలో బీసీల భవనాలను పూర్తి చేసి అధికారికంగా కుల సంఘాలకు ఇవ్వాలని, మహాత్మ జ్యోతిభాయ్ పూలే సర్కిల్లో సావిత్రి భాయ్ విగ్రహం ఏర్పాటు చేయాలని, బీసీ కార్పొ రేషన్లకు నిధులు మంజూరు చేయాలని, కర్నూలు పారిశ్రామికంగా అభి వృద్ధి చేసి వలసలు నివారించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అయ్యన్న యాదవ్, సుగురు వెంకటేశ్వర్లు, వీరాట్ బ్రహ్మయ్య, చంద్రశేఖ ర ఆచారి, తిమ్మయ్య ఆచారి పాల్గొన్నారు.



విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

ఓర్వకల్లు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కన్నమడకల గ్రామానికి చెందిన రైతు సుబ్బరాయుడు ఎద్దు శనివారం విద్యుదాఘా తంతో మృతి చెందింది. మధ్యాహ్నం పొలానికి వెళ్లి సేద్యం పనులు ముగించుకుని నీరు తాగేందుకు వాగులోకి వెళ్లిన ఎద్దు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందింది. దీంతో రైతుకు రూ.80వేలు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం స్పందించి రైతుకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గ్రామ రైతులు కోరుతున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కర్నూలు కలెక్టరేట్ నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నగరంలో శనివారం అక్రమంగా నిల్వ ఉన్న 20 సంచుల రేషన్ బియ్యాన్ని ఏఎస్‌వో రామాం జనేయులు రెడ్డి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వం తెల్లరేషన్ కార్డు దారులకు కందిపప్పు, బియ్యం, చక్కెర జొన్నలు పంపిణీ చేస్తోంది. దళారులు రేషన్‌కార్డులు దగ్గర బియ్యాన్ని కేజీకి రూ.10 కొనుగోలు చేసి పలు ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. జిల్లాలో పలు ప్రాంతాల్లో పౌరసరఫరాల శాఖ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేసింది.



రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడిగా ఆర్జా రామకృష్ణ

కర్నూలు కల్చరల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన ఆర్జా రామకృష్ణ రెండో పర్యాయం రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడిగా ఎంపికయ్యారు. ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర కాపునాడు సర్వసభ్య సమావేశంలో అయన్ను తిరిగి అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. శనివారం కర్నూలుకు వచ్చిన ఆయన్ను స్వగృహంలో నగర బలిజ సంఘం ఆధ్వర్యంలో పత్తి ఓబులయ్య తదితరులు ఘనంగా సత్కరించారు. శైలేష్, అమర్, శేషు, సంగా ఆంజనేయులు పాల్గొన్నారు.

డీఈవోకు శుభాకాంక్షలు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నూతన డీఈవోగా బాధ్యతలు చేపట్టిన శ్యామూల్ పాల్‌కు శనివారం ఏపీ ఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు జేఏసీ చైర్మన్ వెంగళ్ రెడ్డి ఆధ్వర్యంలో ఏపీ ఎన్జీవోలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాయ అధ్యక్షుడు దస్తగిరి రెడ్డి, నగర అధ్యక్షులు కాశన్న, మణిశేఖర్ రెడ్డి, శ్రీనివాస్, కృష్ణమోహన్, మద్దిలేటి, భాస్కర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, కృష్ణుడు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా: సీఐ

సి.బెళగల్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచామని కోడుమూరు సీఐ తబ్రేజ్ అన్నారు. శనివారం సి.బెళగల్ పోలీసు స్టేషన్‌ను ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సీఐ వెంట ఎస్ఐ తిమ్మారెడ్డి, పోలీసులు ఉన్నారు.

సాధనతోనే పతకాలు సాధ్యం

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): నిత్యసాధనతోనే క్రీడల్లో పతకాలు సాధించవచ్చని సెట్కూరు విశ్రాంత సీఈవో రమణ అన్నారు. శనివారం స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలోని స్కేటింగ్ రింగ్‌లో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల బహుమతి కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా రిటైర్డు సీఈవో రమణ, విశిష్ట అతిథులు కర్నూలు మెడికల్ కాలేజీ ఫార్మకలాజీ ప్రొఫెసర్ డాక్టర్ రాజేష్, ఉపాధ్యాయుడు శివశంకర్ రెడ్డి, వ్యాపార వేత్త నవీద్ అహ్మద్, జిల్లా స్కేటింగ్ సీఈవో పి.సునీల్ కుమార్ హాజరై మాట్లాడారు. అనంతరం విజేతలకు పతకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అబుబకర్, పుణీత్ చౌదరి, విజయ్ కిరణ్, సత్యనారాయణ, సోమా సుధీర్, ఎస్ఎండీ ఇర్ఫాన్ పాల్గొన్నారు.





ఉద్యోగంతో వస్తావనుకుంటే.. వెళ్లిపోయావా..!



మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి అనిత

- కాశ్మీర్‌లో మృతిచెందిన వెంకట్ ఆనంద్‌కు కన్నీటి వీడ్కోలు

పత్తికొండ, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉద్యోగంతో వచ్చి మమ్మల్ని చూసుకుంటావని కలలుకంటే వెళ్లిపోయి మాకు దుఃఖాన్ని మిగిల్చావా అంటూ తల్లిదండ్రులు కన్నీటి పర్యంత మయ్యారు. లవ్‌లీ యూనివర్సిటీ బీటెక్ విద్యార్థి వెంకట్ ఆనంద్ రెడ్డి కాశ్మీర్‌లో మృత్యువాత పడిన విషయం విదితమే. శనివారం మృతదేహాన్ని పత్తికొండకు తీసుకు వచ్చారు. తండ్రి ప్రతాప్‌రెడ్డి, బంధువులు విమానంలో కాశ్మీర్‌కు వెళ్లి మృతదేహాన్ని పత్తికొండకు తరలించారు. కుమారుడి మృతదేహాన్ని చూసిన తల్లి అనిత రోదించిన తీరు పలువు రిని కంటతడి పెట్టించింది. ఎన్నో కలలు కన్న తమకు దుః ఖాన్ని మిగిల్చావా అన్న మాటలు విన్న వారిని కలచి వేసింది. దుఃఖాన్ని దిగమిం గుకున్న తండ్రి ప్రతాప్‌రెడ్డి అంతిమ యాత్రలో భావోద్వేగానికి గురై బోరున విలపించారు. తేరు బజార్ ఇంటి నుంచి వెళ్లి స్థానిక శ్మశాన వాటిలో ఖననం చేశారు.

రోడ్లను పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

- టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్



రహదారి మరమ్మతు పనులను ప్రారంభిస్తున్న వీరభద్ర గౌడ్

ఆలూరు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రోడ్ల దుస్థితిని గత వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. రూ.16లక్షలతో చేపట్టనున్న ఆలూరు-కర్నూలు ప్రధాన రహదారి మర మత్తు పనులను శనివారం ప్రారంభించారు. కూటమి ప్రభుత్వ హయాంలో గుంతల రహిత ఆంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు ప్రభుత్వం మరమ్మతులు చేయిస్తుందన్నారు. కల్లి వాగుపై వంతెన నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఆలూరు-చిన్నహోతూరు వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.3కోట్ల నిధులు మంజూరు చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కోరనున్నట్లు తెలిపారు. ఆర్‌అండ్‌బీ జేఈ సురేష్, కాంట్రాక్టర్ రఘునాథ్ రెడ్డి, టీడీపీ నాయకులు వన్నూర్ వల్లి, గుండన్న, అంజనేయ, ఈరన్న, రాము యాదవ్, అంజిరెడ్డి, శ్రీధర్, చిన్నయాదవ్, హనుమప్పా పాల్గొన్నారు.

చైర్మన్ పదవి ఇవ్వాలి

పత్తికొండ టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్వర్ణకారుల కార్పొరేషన్ చైర్మన్ పదవిని విశ్వబ్రాహ్మణులకే ఇవ్వాలని ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు హరికృష్ణ డిమాండ్ చేశారు. శనివారం కర్నూలులో మంత్రి టీజీ భరత్‌కు వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో 30 లక్షల మంది ఉన్నారని స్వర్ణ కారుల వృత్తిపైనే జీవిస్తున్నారన్నారు. ఎన్నికల సందర్భంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. స్పందించిన మంత్రి టీజీ భరత్ సీఎం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారన్నారు. మహానంది, బ్రహ్మయ్య ఆచారి, పోతులూరయ్య పాల్గొన్నారు.



మంత్రి భరత్‌కు వినతి పత్రం ఇస్తున్న విశ్వబ్రాహ్మణులు

మహిళా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న తుగ్గలి నాగేంద్ర

మద్దికెర, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మహిళా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్ర అన్నారు. శనివారం పెరవలి గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం గ్యాస్ ధరలను పెంచి పేదల నెత్తిన భారం మోపారని విమర్శించారు. హామీ మేరకు సీఎం చంద్రబాబు ప్రభుత్వం ఏడాదికి మూడు సిలిండర్లను ఇచ్చి మహిళల కళ్లల్లో ఆనందాన్ని నింపారన్నారు. టీటీడీలో సభ్యులుగా నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజును ఎంపిక చేయడంపట్ల హర్షం వ్యక్తం చేవారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాష్ట్ర అభివృద్ధి కోసం తసేవలుం దిస్తున్నారని అన్నారు. ప్రతిపక్ష వైసీపీ నాయకులు దిక్కు తోచని స్థితిలో విమర్శలు చేస్తున్నారన్నారు. టీడీపీ నాయకులు తిరుపాల్ నాయుడు, జగన్నాథ్ చౌదరి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు వ్యాపార నైపుణ్యాలు అవసరం



మాట్లాడుతున్న కంపెనీ ప్రతినిధి ఖలీల్ బాషా

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు వ్యాపార నైపుణ్యాలు అవసరమని విజయవాడ కోకో కోలా బేవరేజ్ కంపెనీ ప్రతినిధి ఖలీల్ బాషా అన్నారు. శనివారం ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థులకు ఏపీస్కిల్ డెవలప్‌మెంట్ వారి ఆధ్వర్యంలో వ్యాపారం మార్కెటింగ్ నైపుణ్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యాపార నైపుణ్యముంటేనే ఇప్పుడున్న డిజిటల్ వ్యవస్థలో ఉద్యోగాలు పొందవచ్చని సూచించారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేసి కొందరికి ఉద్యోగా లు కల్పించారు. ప్రిన్సిపాల్ మురళీమోహన్, అధ్యాపకులు నరసప్ప, చంద్రశేఖర్, రామకృష్ణ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూస్తాం

- డీఎల్పీవో వీరభద్రప్ప

మద్దికెర, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో తాగునీటి సమస్య రాకుండా చూస్తామని డీఎల్పీవో వీరభద్రప్ప అన్నారు. శనివారం పంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ బండారు సుహాసిని అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి పథకాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలని ఆదేశించారు. 15 రోజులకు ఒకసారి ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. సలహాదారులు బండారు ఆంజనేయులు, ఈవోఆర్డీ మద్దిలేటి స్వామి, పంచాయితీ కార్యదర్శులు శివకుమార్, పరమేష్, సుధాకర్, వన్నూరప్ప, హరికృష్ణ ఉన్నారు.

అభివృద్ధి మొదలు : ఎమ్మెల్యే



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మంత్రులకిచ్చిన వినతిపత్రాలతో నిధులు మంజూరయ్యాయని, ఆదోనిలో అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయని ఎమ్మెల్యే పార్థసారధి అన్నారు. శనివారం నూతన ఫ్లైఓవర్ ప్రాంతంలో గుంతలను పూడ్చే పనులను ప్రారంభించారు. రూ.1.22కోట్లతో ఆర్‌అండ్‌బీ రహదారులకు మరమ్మతులు చేస్తున్నామని, ఉపాధి నిధులు రూ.3.18కోట్లతో గ్రామాల్లో రహదారుల పనులు ప్రారంభించామని అన్నారు. ఫ్లైఓవర్ ఇరువైపులా సర్వీస్ రోడ్లలోని అక్రమణలను ఎమ్మెల్యే పరిశీలించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, బీజేపీ రాష్ట్ర నాయకుడు విట్టా రమేష్, సింహం నాగేంద్ర, నాగరాజ్ గౌడ్, ఉపేంద్ర జనసేన నాయకుడు పులి రాజు, ఆర్‌అండ్‌బీ ఇఇ వెంకటేశ్వరులు, తహసీల్దార్ శివరాముడు, మునిసిపల్ డీఇ రామమూర్తి, కాంట్రాక్టర్ బలరాం పాల్గొన్నారు.

పెరవలిలో సీఎంకు క్షీరాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

మద్దికెర, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉచిత గ్యాస్ పథకం అమలుతో పెరవలి గ్రామంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మాజీ జడ్పీటీసీ పి.పురుషోత్తం చౌదరి, మాజీ సర్పంచ్ వెంకటవర్మ మాట్లాడుతూ ప్రభుత్వం ఒక్కొక్క సంక్షేమ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. నాలుగు నెలల్లో రూ.70 లక్షలతో సీసీ రోడ్లు వేశారన్నారు. మాజీ ఎంపీటీసీ పులిశేఖర్, పెరవలి రామాంజనేయులు, మెడికల్ రాము, భాస్కర్, ఉన్నారు.

గిరిజన తండాల్లో దీపావళి



బాటతాండలో పూలు తీసుకెళ్తున్న యువతులు

తుగ్గలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గిరిజన తండాల్లో దీపావళి వేడుకలను శనివారం వైభవంగా నిర్వహించారు. బాటతండా, మీటెతండా ఇతర తండాల్లో మూడు రోజుల నుంచి సంబరాలు చేసుకున్నారు. శనివారం మహిళలు, యువతులు గంపలలో పూలను తెచ్చి ఇళ్ల ముందు గొబ్బెమ్మలు పెట్టి వాటిని అందంగా అలంకరించి పూజలు చేశారు. యువతీ యువకులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

రైతులకు న్యాయం చేస్తాం

ఆదోని రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రీసర్వే చేయించి సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ శివరాముడు హామీ ఇచ్చారు. శనివారం ఆదోని మండలం చాగిలో రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో రీసర్వేతో నష్టపోయామని ఈనాం భూమిగా చూపుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రీసర్వేతో కొలతల్లో వ్యత్యాసం వచ్చిందని 36మంది వినతిపత్రం అందజేశారు. 460 ఎకరాల భూమిని 183మంది రైతులు సాగు చేసుకుంటున్నారని, పట్టా భూమిని రీ సర్వేలో ఈనాం భూమిగా చూపడడంతో రైతులు వినతిపత్రం అందజేశారు. రీసర్వే డీటీ పెద్దయ్య, సర్పంచు రాజశేఖర్ పాల్గొన్నారు.

గుంతలులేని రహదారులే టీడీపీ ధ్యేయం

తుగ్గలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుంతలు లేని రహదారులు నిర్మించడమే టీడీపీ ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బత్తిన వెంకట్రాముడు, జిల్లా ఉపాధ్యక్షుడు సాంబ శివారెడ్డి అన్నారు. శనివారం ఎద్దులదొడ్డి చెరువు వద్ద పత్తికొండ, ప్యాపిలి ప్రధాన రహదారిలో పడ్డ గుంతలను పూడ్చే పనులు ప్రారంభించారు. గత వైసీపీ ప్రభుత్వం సంక్షేమం పేరుతో అభివృద్ధిని గాలికి వదిలేశారన్నారు. దీంతో రోడ్లు గుంతలు పడి నాశనమయ్యాయనీ, ప్రమాదాలు చోటుచేసుకున్నాయన్నారు. ఆర్‌అండ్‌బీ డీఈ శివరుద్ర, టీడీపీ నాయకులు రామనాయుడు, శ్రీనివాసులు గౌడు, సర్పంచ్ విజయుడు, సీపీఐ నాయకులు నబీ రసూల్, మాజీ సర్పంచ్ ఫక్కీరప్ప, సంజీవ చౌదరి, హరి తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మించాలి

ఆదోని రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాండవగల్లు ప్రభుత్వ పాఠశాలకు రోడ్డు వేయాలని సీపీఎం నాయకులు రామాంజనేయులు, పాండురంగ, గోవిందు డిమాండ్ చేశారు. శనివారం విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. రహదారి గుంతలు, బురదమయం కావడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని నూతన రహదారి నిర్మించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

తుగ్గలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఖో-ఖో పోటీలకు తమ విద్యార్థులు ఎంపికైనట్లు జడ్పీహెచ్ పాఠశాల హెచ్‌ఎం బాబురావు, పీఈటీ చందునాయక్ శనివారం తెలిపారు. రంజిత్, సమీరా, అరుణ్ కుమార్‌ను ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులు రాజమోహన్, సుధాకర్, భాస్కర్, దాసు నాయక్ ఉన్నారు.

ఎన్నికలకు సిద్ధం కండి

ఆదోని రూరల్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): సాగునీటి సంఘాల ఎన్నికలకు సిద్ధం కావాలని తహసీల్దార్ శివరాముడు తెలిపారు. శనివారం జలవనరుల అధికారులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. అధికారులు షఫీవుల్లా, వేణుగోపాల్, రామాంజనేయులు, పాల్గొన్నారు.

మండల సమావేశం బహిష్కరణ

హొళగుంద, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎంపీపీ నూర్జహాన్ అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీటీసీలు బహిష్కరించారు. గత సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఏఈ హాజరు కాకపోవడంపై మండిపడ్డారు. అధికారులు రానప్పుడు సమస్యలు ఎలా పరిష్కారం అవుతాయని ఆగ్రహం వ్యక్తం చేస్తూ బహిష్కరించారు. హొళగుంద-ఆదోని రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఎంపీడీవో విజయలలితను వివరణ కోరగా ఆర్‌అండ్‌బీ అధికారులు రాలేదని ఎంపీటీసీలు బహిష్కరించారని, అధికారులతో మాట్లాడి మరలా నిర్వహిస్తామని తెలిపారు. ఈవోఆర్డి చక్రవర్తి, వైస్ ఎంపీపీ హనుమంతమ్మ, ఎంపీటీసీలు ఉరుకుందప్ప, శివన్న, మల్లయ్య, లక్ష్మికాంత్ రెడ్డి పాల్గొన్నారు.

పార్టీ సభ్యత్వంతో భరోసా



రాతనలో సభ్యత్వం నమోదు చేయిస్తున్న మనోహర్ చౌదరి

తుగ్గలి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం సభ్యత్వంతో కుటుంబానికి భరోసా ఉంటుందని ఆ పార్టీ తెలుగు రైతు ఉపాధ్యక్షుడు మనోహర్‌చౌదరి అన్నారు. శనివారం రాతనలో టీడీపీ సభ్యత్వ నమోదు చేయించారు. పార్టీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, కృష్ణమూర్తి చౌదరి, కాలయ్య ఆచారి, వెంకటేశ్వర్లు, మైరాముడు, శ్రీనివాసులు, ముక్కెళ్ల రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉపాధి పనులు ప్రారంభం

పత్తికొండ టౌన్, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రేపటి నుంచి ఉపాధి పనులు ప్రారంభిస్తున్నట్లు ఏపీవో వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ పత్తికొండ మండలంలోని 17 పంచాయితీల్లో కూలీలకు 4.60 లక్షల పనిదినాలను ఏడాదంతా కల్పిస్తామన్నారు. ఏ గ్రామంలోనూ వలస వెళ్లకుండా పనులు కల్పిస్తున్నామని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీ



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

వెల్దుర్తి, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీలో శనివారం ఉచిత గ్యాస్ సిలిండర్‌ను టీడీపీ నాయకులు సుబ్బరాయుడు, జ్ఞానేశ్వర్‌గౌడ్, బలరాంగౌడ్ పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు సూపర్ సిక్స్‌లో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్‌ను ఇస్తున్నారన్నారు. 03.31.25 వరకు గ్యాస్ సిలిండ్ బుక్ చేసుకోవచ్చన్నారు. తహసీల్దార్ చంద్రశేఖర వర్మ, డిస్ట్రిబ్యూటర్ రమేష్‌గౌడ్, బజారు, వీఆర్వో ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా మాజీ మంత్రి బీవీ జయంతి



ఎమ్మిగనూరు టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు





గోనెగండ్ల, నందవరంలో బీవీ మోహన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు, జడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్ పుష్పావతి

ఎమ్మిగనూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మాజీ మంత్రి, దివంగత నేత బీవీ మోహన్‌రెడ్డి జయంతిని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. బీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ ఎన్టీఆర్ ప్రియ శిష్యుడిగా పేరొందిన బీవీ ఎమ్మిగనూరు నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది ఆరుసార్లు మంత్రిగా పని చేసి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసి ఈ ప్రాంత ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు కొండయ్య చౌదరి, మహేంద్ర బాబు, రామదాసు గౌడ్, మిఠాయి నరసింహులు, దయాసాగర్, ముల్లా కలీముల్లా, నజీర్, మురళి, జయన్న, చేనేత మల్లి, దేవేంద్ర, రంగస్వామి గౌడ్, నాగరాజు, శాలేమ్, పార్లపల్లి మల్లికార్జున, సురేష్ చౌదరి, నరసింహులు, ఈరన్న, కృష్ణలు పాల్గొన్నారు.

నందవరం: మండల కేంద్రమైన నందవరం టీడీపీ కార్యాలయంలో దివంగత మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి జయంతిని శనివారం జడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్ పుష్పావతి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. బీవీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జి కాశీంవలి, మండల పార్టీ కన్వీనర్ డీవీ రాముడు, ముగతి భార్గవ్‌యాదవ్, మస్తాన్, పెద్దరాముడు, నదికైరవాడి వీరేష్, ఆదిశేషు, పల్లె తిప్పారెడ్డి, నరసప్ప, సత్యారెడ్డి, రామకృష్ణరెడ్డి, వీరేష్, మల్లి, వీభూతి మల్లయ్య, సోమన్న పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండల కేంద్రమైన గోనెగండ్లలో దివంగత నేత మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డి జయంతిని శనివారం మండల టీడీపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూల వేసి నివాళి అర్పించారు. టీడీపీ నాయకులు మేజర్ సర్పంచ్ హైమావతి, నజీర్, బేతాలబేడేసాబ్, రామాంజినేయులు, రమేష్‌నాయుడు, రంగ స్వామినాయుడు, తిరుపతయ్య, నూరహమ్మద్, భారతం రహంతుల్ల కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో, కులుమాల రాముడు, కులుమాల చాంద్, ఫకృద్దీన్, అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, మదీనా, వినోద్ గౌడ్, శ్రీధర్, డాక్టర్ మిన్నల్ల, అబ్దుల్, చాంద్, పాల్గొన్నారు. అలాగే పెద్దనేలటూరు గ్రామంలో బీవీ మోహన్‌రెడ్డి జయంతిని జరుపుకున్నారు. టీడీపీ నాయకులు బసవరాజ్‌స్వామి, శేషప్ప నాయుడు, వీరన్నగౌడు, రామాంజినేయులు, గోపాల్, నాగన్న, ఖాజ, గొల్లరాముడు, సోమన్న, నారాయణ పాల్గొన్నారు.

గుంతలు లేని రోడ్లను ప్రజలు చూస్తారు

మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి



రోడ్డుకు భూమి పూజ చేస్తున్న రాఘవేంద్రరెడ్డి

కోసిగి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గుంతలు లేని రోడ్లను 2025 జనవరిలోపు ప్రజలు చూస్తారని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. శనివారం కోసిగిలో రోడ్డు మరమ్మతు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోసిగి-పెద్దతుంబళం ఆర్‌అండ్‌బీ రోడ్డు ప్యాచ్‌వర్కుల కోసం, అలాగే రోడ్ల నిర్మాణం కోసం రూ.2 కోట్లు నిధులు మంజూరయ్యాయని అన్నారు. సూపర్ సిక్స్‌లో భాగంగా ఇంకా ఎన్నో పథకాలు ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, జ్ఞానేష్, వక్రాణి వెంకటేష్, బీజేపీ రాముడు, చింతలగేని నర్సారెడ్డి, వీరేష్, సాతనూరు కోసిగయ్య, రణతిక్కన్న, గాలెం వీరేష్, సొట్టయ్య, పోతుల వీరారెడ్డి, నాడిగేని చిన్న తాయన్న, జనసేన నాయకులు రమేష్, ఖలందర్, మాణిక్య రాజు, గౌస్, తదితరులు పాల్గొన్నారు.

మూలరాములకు మహాభిషేకం



మూలరాములకు మహాభిషేకం చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): వేదపండితుల మంత్రోచ్చరణాలు, మంగళవాయిద్యాల మధ్య పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు మూలరాములకు మహాభిషేకం నిర్వహించారు. శనివారం బలిపాడ్యమిని పురస్కరించుకుని పూర్ణబోధ పూజా మందిరంలో విశాల వెండి మండపం, అందులో బంగారు మండపంలో మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు మహాభిషేకం నిర్వహించారు. ఏడాదిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే మహాభిషేకానికి దేశ నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చి మహాభిషేకాన్ని తిలకించి మంత్రముగ్ధులయ్యారు. అనంతరం మూలరాములకు పీఠాధిపతి కనకాభిషేకం చేసి భక్తులను ఆశీర్వదించారు. బృందావనాలకు మహా మంగళహారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నందవరం, నవంబరు 2(ఆంధ్యజ్యోతి): మండలంలోని ధర్మాపురం దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు మహిళల బంధువులను శనివారం టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దేశాయి మాధవరావు ఎమ్మిగనూరు ఆసుపత్రిలో పరామర్శించారు. మృతదేహాలను పరిశీలించి సంఘటన వివరాలు తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు ఒక్కరికి రూ.10 లక్షలు ఆర్థిక సాయం వచ్చేలా చూడాలని అధికారులను కోరారు. టీడీపీ నాయకులు జగన్నాథరెడ్డి, హాలహర్వి వైసీపీ నాయకులు గడ్డం నారాయణరెడ్డి, జయరాముడు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే డీవైఎఫ్ఐ లక్ష్యమని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్ అన్నారు. శనివారం పట్టణంలో మేకల బజారులో ఆ సంఘం నాయకుడు వీరేష్ అధ్యక్షతన మాజీ డీవైఎఫ్ఐ నాయకులు మాణిక్యం రాఘవేంద్ర జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో సురేష్, రవి, బాబు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సురేష్

పల్లెల్లో ఆగని వలస



తెలంగాణకు వలస వెళ్తున్న పెద్దకడబూరు కూలీలు

పెద్దకడబూరు, నవంబరు 2(ఆంధ్ర జ్యోతి): నిత్యం ఏదో ఒక గ్రామం నుంచి పదులు, వందల సంఖ్యలో వలసలు వెళ్లిపోతున్నారు. ఉన్న ఊర్లు పనులు చేసుకుందామంటే ఉపాధి పనుల్లేవు. గ్రామాల్లో కరువు ఏర్పడడంతో పంటలు కూడా లేవు. చేసేదిమి లేక పిల్ల పాపాలతో కలిసి మూటముల్లు సర్దుకోని తెలంగాణకు వలస బాట పట్టారు. శనివారం మండల కేంద్రమైన పెద్దకడబూరు, దొడ్డిమేకలలోని దాదాపుగా 20 కుటుంబాలు వలస వెళ్లారు. ఇప్పటికైనా గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

కౌతాళం నుంచి 50 కుటుంబాలు వలస

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళం నుంచి శనివారం రాత్రి దాదాపు 50పైగా కుటుంబాలు రెండు వాహనాల్లో తెలంగాణకు వలస వెళ్లారు. కౌతాళంలోని మాసలగేరి, బైటిగేరి నుంచి కూలీలు వలసలు పోయారు. కూలీలతో పాటు వారి పిల్లలు కూడా వలస బాట పట్టి పుస్తకాలకు స్వస్తి పలికారు. గ్రామంలో ఇంత వరకు వ్యవసాయ పనుల వల్ల పత్తితీత పనులు ఉండేవని ప్రస్తుతం పనులు తగ్గిపోవడంతో మిరప కోత పనులు వచ్చే వరకు దాదాపు రెండు నెలలు పనులు ఉండవని అంత వరకు జీవనం ఎలా కొనసాగించేదని కూలీలు రంగమ్మ, అమోజమ్మ, గంగమ్మ, రామాంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు.

భూ సమస్యలు పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న తహసీల్దార్

గోనెగండ్ల, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేలలో జరిగి పొరపాట్లను సరిచేసేందుకు రైతుల భూసమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని తహసీల్దార్ కుమారస్వామి అన్నారు. శనివారం మండల పరిధిలోని బైలుప్పల గ్రామంలో భూ సర్వే గ్రామ సభ నిర్వహించారు. అధికారులు వంద అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ శిరీషా, జనార్దన్ రావు, ఆర్ఐ రామకృష్ణ, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

పింఛన్ పునరుద్ధరించండి సారూ..

- వేలి ముద్రలు పడటం లేదని తొలగింపు
- రెండేళ్లుగా 70 ఏళ్ల వృద్ధురాలి నిరీక్షణ

కౌతాళం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): పుట్టుకతోనే కళ్లులేవు. నా అన్నవారు ఎవరు లేరు. వయస్సు మీదపడటంతో ఏ పని చేసుకోలేని స్థితిలో ఉంది. ఈ వృద్ధురాలి పింఛన్‌ను తొలగించారు. దీంతో తాను ఎలా బతకాలని ఆమె కన్నీటి పర్యంతం అవుతోంది. కౌతాళం మండలం సుళేకేరి గ్రామానికి చెందిన బోయ దుర్గప్ప, సంజీవమ్మలకు హనుమంతమ్మ సంతానం. హనుమంతమ్మకు పుట్టుకతోనే రెండు కళ్లు లేకపోవడంతో తల్లిదండ్రులే యోగక్షేమాలు చూసుకునేవారు. ఇరవై ఏళ్ల క్రితం తండ్రి మరణించడంతో కుటుంబ పోషణ తల్లి సంజీవమ్మపై పడింది. ఉన్న ఒక్కగానొక్క కూతురు అంధురాలు కావడంతో రూ.50 నుంచి ప్రభుత్వ పింఛను అందుతుండేది. తల్లి గ్రామంలో కూలీ పనులకు పోయి బిడ్డను చూసుకునేది. పదేళ్ల క్రితం తల్లి కూడా మరణించడంతో ఈమె యోగక్షేమాలను చేసుకునే వారు లేకపోవడంతో గ్రామంలో అనాథగా మిగిలిపోయినది. గ్రామస్థుల సహకారం తనకు వచ్చే పింఛను డబ్బులతో జీవనం కొనసాగించేది. ప్రస్తుతం హనుమంతమ్మ వయస్సు 70 సంవత్సరాలు. అయితే 2022లో వైసీపీ ప్రభుత్వం ఈకేవైసీ పేరుతో వేలి ముద్రలు తీసుకోవడంతో హనుమంతమ్మ వేలి ముద్రలు పడకపోవడంతో అప్పటి నుంచి అధికారులు పింఛను నిలిపి వేశారు. దీనికి తోడు వలంటీర్లు కూడా ఈమెకు 10 ఎకరాల భూమి ఉన్నందున పింఛను రాదని తెలిపారు. తనకు ఉండేందుకు స్థలం లేదని, 10ఎకరాలు ఎలా వచ్చిందో చెప్పాలని వలంటీర్లను నిలదీయడంతో, తమకేమి తెలియదని అధికారులే పింఛను నిలిపివేశారని చెప్పి జారుకున్నారు. వృద్ధురాలికి పింఛను ఇవ్వాలని గ్రామస్థులు ఎన్నోసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిపినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇటీవల గ్రామానికి చెందిన ఓ యువకుడు వృద్ధురాలి పరిస్థితిని గురించి ఆదోనిలో సబ్ కలెక్టర్‌కు స్పందనలో ఫిర్యాదు చేయడంతో కౌతాళం ఎంపీడీవో సుబ్బరాజు వృద్ధురాలిని కార్యాలయానికి పిలిపించారు. పింఛను పునరుద్ధరించేలా చూస్తానని హామీ ఇచ్చారు. గతంలో వేలి ముద్రలు, ఐరిష్ సరిపోని వారికి అధికారుల లాగిన్ ద్వారా పింఛను అందించేవారు. ఆ విధానం ద్వారా ఆ వృద్ధురాలికి పింఛన్ ఇవ్వవచ్చు.



అంధురాలు హనుమంతమ్మ

కర్ణాటక మద్యం స్వాధీనం

ఇద్దరి అరెస్టు.. బైక్ సీజ్

మంత్రాలయం, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం సమీపంలో ఎస్ఐ విజయకుమార్ ఆధ్వర్యంలో కర్ణాటక మద్యంతో సహా ఇద్దరిని అరెస్టు చేసి బైక్‌ను సీజ్ చేశారు. శనివారం కర్ణాటక నుంచి కోసిగి మండలం డి.బెళగల్ గ్రామానికి చెందిన తిరుమలేష్, చెన్నకేశవరెడ్డి ఇద్దరు వ్యక్తులు బైక్‌పై 384 ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ 4 బాక్సులను క్యాన్‌లలో పెట్టుకుని కర్ణాటక నుంచి తరలిస్తుండగా.. పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని బైక్ సీజ్ చేసి ఎమ్మిగనూరు కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ విజయ కుమార్ తెలిపారు.

చోరీకి గురైన వెండి కిరీటాలు

పెద్దకడబూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): రూ.లక్ష విలువ చేసే వెండి కిరీటాలు చోరీకి గురైయ్యాయి. శనివారం మండల పరిధిలోని కల్లుకుంట గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు బీరప్ప దేవాలయంలో చోరీ చోటు చేసుకుంది. శనివారం ఉదయం ఆలయానికి వచ్చిన పూజారి గమనించి గ్రామ పెద్దలకు తెలియజేశారు. దాంతో వారు పరిశీలించగా వెండి కిరీటాలు చోరీ అయినట్లు గుర్తించారు. ఈ విషయంపై ఎస్ ఐ నిరంజన్ రెడ్డిని వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

రాజగోపుర నిర్మాణానికి విరాళం

కౌతాళం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి శనివారం ఓ భక్తుడు రూ.లక్ష నగదును ఆన్‌లైన్‌లో విరాళంగా అందించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ స్వామి వారి దేవాలయంలో నిర్మిస్తున్న రాజగోపుర నిర్మాణానికి రాయచూరుకు చెందిన రవీంద్రకుమార్ కుటుంబ సభ్యులు కుటుంబ సభ్యులతో కలిసి వారి తల్లిదండ్రులు లేట్ కాళిదాసు, ఈరమ్మల జ్ఞాపకార్థం రూ.లక్ష నగదును ఆన్‌లైన్ ఆలయ సూపరింటెండెంట్ మల్లికార్జున స్వామికి అందజేసినట్లు తెలిపారు.

నిజాయితీ చాటుకున్న చిన్నారులు

అభినందించిన సీఐ



చిన్నారులకు నగదు బహుమతి అందజేస్తున్న భీమన్న

ఎమ్మిగనూరు, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏదైనా విలువైన వస్తువు దొరికితే చటుక్కున తీసుకోని చిన్న పెద్ద తేడాలేకుండా దాచుకుంటున్న కాలమిది. అయితే నలుగురు చిన్నారులకు వేల రూపాయలు విలువ చేసే సెల్‌ఫోన్ దొరికితే దాచుకోని ఇంటికి తీసుకెళ్లకుండా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సీఐ సుదర్శన్ రెడ్డికి అప్పగించారు. ఈ సంఘటన కాస్తా ఆలస్యంగా వెలుగుచూసింది. నందవరం మండలంలోని ఓ గ్రామానికి చెందిన నలుగురు విద్యార్థులు ఎమ్మిగనూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారు. రోజు మాదిరిగానే పాఠశాలకు వచ్చేందుకు బస్సులో ఎమ్మిగనూరుకు వచ్చారు. బస్టాండ్ నుంచి నడుచుకుంటూ పాఠశాలకు వెళ్తుండగా సోమప్ప సర్కిల్‌లో సెల్‌ఫోన్ దొరికింది. దానిని పట్టణ పోలీస్ స్టేషన్‌లో సెల్‌ఫోన్‌ను సీఐ సుదర్శన్‌రెడ్డికి అప్పగించారు. దీంతో చిన్నారుల నిజాయితీని అభినందించారు. కాగా కొద్దిసేపటి తర్వాత సెల్‌ఫోన్ పోగొట్టుకున్న భీమన్న అనే వ్యక్తి ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వచ్చాడు. విచారించిన సీఐ చిన్నారులు అప్పగించిన సెల్‌ఫోన్ భీమన్నదే అని గుర్తించి ఆయనకు అప్పగించారు. ఎంతో నిజాయితీగా సెల్‌ఫోన్ తెచ్చి ఇచ్చిన చిన్నారులను భీమన్న అభినందించి నగదును బహుమతిగా అందజేశారు.

ఇది ఊరా..? చెత్త దిబ్బనా..?



కోసిగి తేరుబజారు మైదానంలో ఉన్న చెత్త కుప్ప

కోసిగి, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): కోసిగిలోని తేరుబజారు మైదానంలో సుమారు 250 వ్యాపార దుకాణాలు ఉన్నాయి. తేరు బజారు మైదానం మొత్తం చెత్తకుప్పలా మారింది. ఇటు దేవాదాయ శాఖ అధికారులు గానీ, పంచాయతీ అధికారులు గానీ పట్టించుకోకపోవడంతో కోసిగి మొత్తం చెత్తదిబ్బలా తయారైంది. ఊరి నడిరోడ్డులో చెత్త కుప్పలు దర్శనం ఇస్తుండటంతో పలువురు వ్యాపారస్థులు, ప్రజలు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.